

బతుకు పోరాటాన్ని గుర్తించలేకపోయారు !

- ఉచితాలపై జస్టిస్ గవాయ్ వ్యాఖ్యలపై బృందా కరత్ లేఖ 7

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 194 | విజయవాడ, శనివారం 15 ఫిబ్రవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 15 February 2025 | Rs



జాతీయ క్రీడల్లో సర్వీసెస్‌కు అత్యధిక పతకాలు

- ఆంధ్రప్రదేశ్‌కు 18వ, తెలంగాణకు 26వ స్థానం
- ముగిసిన 38వ జాతీయ క్రీడలు 8

ప్రైవేటుకు సాగునీరు..

జోరుగా కసరత్తు

కెపిఎంజికి అధ్యయన బాధ్యత • కాలువల గేట్ల వద్దే మీటర్లు

ఎకరాల వారీగా లెక్కలు • వసూళ్ల కోసం అవుట్‌సోర్సింగ్ లస్కర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతాంగంలో తీవ్ర వ్యతిరేకత రావడంతో గతంలో పక్కనపెట్టేసిన సాగునీటి సంస్కరణలను అమలు చేయడానికి టిడిపి కూటమి ప్రభుత్వం సిద్ధమౌతోంది. దీనిలో భాగంగా పంట కాలువలను ప్రైవేటీకరించే కసరత్తు జోరుగా సాగుతోంది. గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో పంట కాలువల నిర్వహణను ప్రైవేటుకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఆయన ఆదేశాలు జారీ చేసిన 24 గంటల్లోనే అధికార యంత్రాంగం దీనిపై విస్తృతంగా కసరత్తు చేస్తోంది. మరోవైపు దీనిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి, అమలుకు సంబంధించిన వ్యూహాన్ని రూపొందించే బాధ్యతను అంతర్జాతీయంగా ప్రఖ్యాతి పొందిన క్లీన్‌వెల్డ్ పీట్ మార్వెక్ గోర్డెలర్ (కెపిఎంజి) ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు అప్పగించినట్లు తెలిసింది. ప్రపంచంలోనే నాలుగు అతిపెద్ద ఆడిట్ సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఈ సంస్థ అకౌంటింగ్ సేవలు అందించడంతోపాటు, తన ఖాతాదారులకు వివిధ అంశాలపై సర్వేలు నిర్వహించడం, ఇతర వృత్తిపరమైన సలహాలు ఇవ్వడం వంటి సేవలను అందిస్తుంది. తాడేపల్లిలోని విజయవాడ క్లబ్ సమీపంలో ఈ సంస్థ ఇప్పటికే కార్యాలయాన్ని ఏర్పాటుచేసుకుంది.

ప్రైవేటీకరణ ఇలా...

రాష్ట్రంలోని ఇరిగేషన్ కాలువలను, వాటి స్లూయిస్‌ల ఆధారంగా ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని అధికారులు ప్రతిపాదించినట్లు



పంట కాలువు

తెలిసింది. ఉదాహరణకు కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో రికార్డుల ప్రకారం 4.99 లక్షల ఎకరాల సాగుంది. ప్రస్తుతం కొంత తగ్గింది. దీనిలో గుంటూరు, ప్రకాశం జిల్లాలకు నీరందించే కొమ్మమూరు కెనాల్ 91 కిలోమీటర్లు ఉంది. దీని కింద 1.91 లక్షల ఎకరాలు సాగవుతోంది. వీటిల్లో పంట కాలువల్లో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు, గేట్ల నిర్వహణ, సిబ్బంది జీతాల ఖర్చును పరిగణనలోకి తీసుకుని ఎన్నికోట్లు ఖర్చవుతుందో లెక్కిస్తారు. అంటే ఈ కాలువ పరిధిలోని కాకుమాను మండలంలో 30,822 ఎకరాల పరిధిలో పంట కాలువల నిర్వహణకు రూ.6 కోట్లు ఖర్చవుతుందని లెక్కగడితే ఎకరాకు సుమారుగా రూ.1,946 లెక్క తేలుతుంది. మండల పరిధిలో ఉన్న పంట కాలువల వారీగా విడగొట్టి ఏ కాలువ కింద ఎన్ని ఎకరాలుంటే అన్ని రూ.1946 వసూలు చేస్తారు. నీటివినియోగ లెక్కలు తీసేందుకు కాలువల గేట్ల వద్దే వాటర్‌గేజ్‌లు(నీటిమీటర్లు) ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం .


లస్కర్ల ద్వారా వసూళ్లు ...!

ప్రైవేటు ఏజెన్సీలకే నేరుగా వసూళ్ల బాధ్యతలు అప్పగించకుండా తొలిదశలో లస్కర్ల ద్వారా ఆ పని చేయించాలని అధికారులు ప్రతిపాదించినట్లు తెలిసింది. లస్కర్ల వ్యవస్థ ప్రస్తుతం నామమాత్రంగా మారడంతో అవుట్‌సోర్సింగ్ ద్వారా కొత్త వారిని నియమించుకోవాలని అధికారులు ప్రతిపాదించారు. 1996లో విడుదల చేసిన జిఓ నెంబరు 29 ప్రకారం రాష్ట్రంలో కాలువల నిర్వహణ కోసం 7,224 మంది లస్కర్ల అవసరం ఉంది. 2024 జూన్ నాటికి వీరిలో 1,517 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగిలిన వారిని అవుట్‌సోర్సింగ్ పద్దతిలో నియమించుకోవాలని అధికారులు ప్రతిపాదించారు. వీరి వేతనలకు ఏడాదికి రూ.139 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. నిర్వహణా ఖర్చులు వసూలు మిగతా 7లో

డబుల్ ఇంజన్ ప్రభుత్వం దివాలా

- మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనపై సిపిఎం విమర్శ

న్యూఢిల్లీ : మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధింపుతో బిజెపి డబుల్ ఇంజన్ ప్రభుత్వ ఘోరమైన దివాళాకోరుతనం తేటతెల్లమైందని సిపిఎం విమర్శించింది. గత రెండేళ్ళుగా బిజెపి పాలనలో రాష్ట్రం హింసతో అట్టుడికిపోయిందని పేర్కొంది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'మణిపూర్ ప్రజల ప్రయోజనాల కోసం రాష్ట్రపతి పాలన విధించలేదు.. పాలక సంకీర్ణంలో నెలకొన్న అంతర్గత కుమ్ములాటలను పరిష్కరించుకోవడానికి కొంత సమయం కావాలి కాబట్టి ఈ చర్య తీసుకున్నారు' అని పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఈ మొత్తం వ్యవహారంలో ప్రధాన దోషి అయిన ముఖ్యమంత్రికి మొదట నుండి కూడా బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ మద్దతు వుంటూనే వచ్చిందని గుర్తు చేసింది. ఆయన పక్షపాతంగా వ్యవహరించారన్న అభియోగాలపై న్యాయస్థానం ప్రస్తుతం విచారణ జరుపుతోందని, ఒక గ్రూపు పట్ల ఆయన పక్షపాత ధోరణితో వ్యహరించారనడానికి సాక్ష్యాధారాలు కూడా కోర్టుకు అందాయని పేర్కొంది. ఈ పరిణామాలతో.. ఇక పదవికి రాజీనామా చేయడం మినహా ముఖ్యమంత్రికి మరో అవకాశం లేకుండా పోయిందని పొలిట్‌బ్యూరో విమర్శించింది. ఈ మొత్తం వ్యవహారాల్లో, పాలక పార్టీ కేంద్ర నాయకత్వం, కేంద్ర ప్రభుత్వం రెండూ, రాష్ట్ర ప్రజలు పడుతున్న తీవ్ర ఇబ్బందులు, కష్టాలను తొలగించేందుకు అవసరమైన చర్యలను తీసుకోవడానికి నిరాకరించాయని సిపిఎం పేర్కొంది. హింసాత్మక ఘటనలతో తల్లడిల్లుతున్న రాష్ట్రంలో పర్యటించడానికి కూడా ప్రధాని సుముఖత చూపకపోవడం ...వారి నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతోందని తెలిపింది. ఈ పరిస్థితి పాలక పార్టీ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ వర్గ దృక్పథాన్ని బట్టబయలు చేస్తోందని, రాష్ట్రం, రాష్ట్ర ప్రజల కన్నా తన స్వంత రాజకీయ ప్రయోజనాలే మిన్నగా భావించారని పొలిట్‌బ్యూరో ఆక్షేపించింది. రాష్ట్రపతి పాలన విధించడమనేది సమస్యకు పరిష్కారం కాదని పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది. ఇక్కడ కేంద్ర ప్రభుత్వం తన మిగతా 7లో



ద్వైపాక్షిక చర్చల అనంతరం మీడియాతో మాట్లాడుతున్న ట్రంప్, మోడీ

భారత్‌కు యుద్ధ విమానాలు, చమురు విక్రయం

మోడీతో చర్చల అనంతరం ట్రంప్ ప్రకటన

ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు : మోడీ

వాషింగ్టన్ : ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకునే దిశగా అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శ్వేతసౌధంలో చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు మీడియాతో మాట్లాడారు. భారత్‌కు ఎఫ్-35 యుద్ధ విమానాలను, చమురును విక్రయించేందుకు అమెరికా అంగీకరించింది. ఈ సంవత్సరం నుండే భారత్‌కు సైనిక అమ్మకాలు పెంచుతామని తర్వాత ట్రంప్ ప్రకటించారు. వాటిలో భాగంగా ఎఫ్-35 ఫైటర్ జెట్లను సరఫరా చేస్తామని చెప్పారు. అంతేకాక భారత్‌కు ఇంధనాన్ని విక్రయిస్తామని తెలిపారు. రెండు దేశాల మధ్య వాణిజ్య లోటును భర్తీ చేసేందుకు అమెరికా నుండి చమురు, గ్యాస్‌ను భారత్ దిగుమతి చేసుకుంటుందని అన్నారు. వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిపేందుకు రెండు దేశాలు అంగీకరించాయని ట్రంప్ చెప్పారు. త్వరలోనే కొత్త రక్షణ ఫ్రేమ్‌వర్క్ కూడా కార్యరూపం దాలుస్తుందని ప్రకటించారు. ముంబయిపై జరిగిన 26/11 ఉగ్ర దాడిలో కీలక నిందితుడిగా ఉన్న తహావర్ రాణాను భారత్‌కు అప్పగించేందుకు అమెరికా ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. ఈ ఏడాది నుండే భారత్‌కు అనేక బిలియన్ డాలర్ల విలువ కలిగిన సైనిక విక్రయాలను పెంచడం ప్రారంభిస్తామని అన్నారు. మోడీతో జరిగిన సమావేశం వివరాలను తెలియజేస్తూ ఇప్పటికే రక్షణ భాగస్వామ్యాన్ని విస్తరించుకున్నామని, ఆర్థిక సంబంధాలను కూడా బలోపేతం చేసుకుంటామని ట్రంప్ చెప్పారు. మంచి విశ్వాసానికి సంకేతంగా వాణిజ్య సంబంధాలకు మరింత న్యాయాన్ని జోడిస్తామని, పరస్పరం ఇచ్చి పుచ్చుకునే వైఖరిని అవలంబిస్తామని ట్రంప్ తెలిపారు. అక్రమ వలసలు కూడా తమ మధ్య చర్చకు వచ్చాయని, ఇవి కేవలం భారత్‌కే పరిమితం కాలేదని మోడీ చెప్పారని అన్నారు. మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు తామిద్దరం కృషి చేస్తామని తెలిపారు.

సుంకాలే ప్రధాన సమస్య 7

దామాషా ప్రకారం నిధులు

- బిసి సంక్షేమశాఖ సమీక్షలో సిఎం
- విద్యార్థుల డైట్ బకాయిలు చెల్లించాలని ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ప్రతి కార్పొరేషన్‌కు దామాషా ప్రకారం నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. బిసి సంక్షేమశాఖపై సచివాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిసిలకు స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపినట్టు చెప్పారు. చేనేత వస్త్రాలపై జిఎస్టి రద్దు చేసేందుకు కట్టుబడి ఉన్నామని, దీనిపై ఇప్పటికే విధివిధానాలు రూపొందించామని చెప్పారు. రజకులకు మేలు చేకూరేలా రాష్ట్రంలో 2014-19 మధ్య నిర్మించిన దోబి ఘాట్ల మరమ్మతులు, అవసరమైనే చోట కొత్తవి నిర్మించడంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. రానున్న బడ్జెట్‌లో కేటాయించే నిధులతో రాష్ట్రంలో బిసి భవనాలు పూర్తి చేయాలని వెల్లడించారు. 2014 నుంచి బిసి కార్పొరేషన్ ద్వారా లబ్ధి పొందిన వారి సమాచారాన్ని సేకరించాలని, వృత్తి ప్రామాణికంగా రుణాలు తీసుకున్నవారు ప్రస్తుతం ఎంతమంది కొనసాగిస్తున్నారో ఆడిట్ చేయాలని ఆదేశించారు. పెండింగ్ ట్యూటర్స్ హానరోరియంకు సంబంధించి 485 హాస్టళ్లలో ఇప్పటి వరకు రూ.4.35కోట్లు చెల్లించాల్సి ఉందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా చెల్లించేందుకు ఆయన అనుమతులు ఇచ్చారు. డైట్ చార్జీలు రూ.185.27కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వివరించగా ప్రస్తుతం రూ.110.52కోట్లు చెల్లింపులకు సిఎం అంగీకరించారు. కాస్మోటిక్ బిల్లులు రూ.29కోట్లు కూడా చెల్లించాలని ఆదేశించారు. హాస్టళ్ల విద్యుత్ సరఫరాకు సంబంధించిన పెండింగ్ బిల్లులు కూడా వెంటనే చెల్లించాలని సూచించారు. సత్యసాయి జిల్లాలోని నసనకోట, ఆత్మకూరు బిసి సంక్షేమ బాలికల పాఠశాలలను రెసిడెన్షియల్ బిసి గర్ల్స్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు, కుప్పంలో బిసి బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు సిఎం సుముఖత వ్యక్తం చేశారు. వైసిపి హయాంలో బిసిలను ఊచకోత కోశారని, వారి హత్యలపైనా విచారణ వేగవంతం చేసి నిందితులను కఠినంగా శిక్షించేలా మానిఫెస్టోలో పొందుపరిచామని, అవసరమైతే ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. బిసి రక్షణ చట్టాన్ని సబ్‌కమిటీ నివేదిక రాగానే అమల్లోకి తేస్తామన్నారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ శాఖమంత్రి సవిత, శాఖ అధికారులు పాల్గొన్నారు.

మిర్చి రైతుకు నష్టాల ఘాటు

- గతేడాది కన్నా క్వింటాలుకు రూ.10 వేల తగ్గుదల
- వారం రోజుల్లో రూ.3 వేల క్షీణత
- చోద్యం చూస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

3

లేబర్ మార్కెట్ స్థిరీకరణకు చైనా చర్యలు

- కోటిన్నర మందికి ఉపాధి కల్పన
- దేశవ్యాప్తంగా జాబ్‌మేళాలు

7

సొంతిల్లు లేని కుటుంబాలు.. 27 లక్షలు

- ఉండడానికి చోటేలేకుండా 1.40 లక్షల కుటుంబాలు
- సచివాలయాల సర్వేలో వెలుగులోకి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి



దశాబ్దాల తరబడి ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నప్పటికీ, ఇళ్లు లేని వారి సంఖ్య మాత్రం తగ్గడం లేదు. తాజాగా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేలో 27 లక్షల కుటుంబాలు సొంత ఇళ్లు లేకపోవడంతో అద్దె ఇళ్లలో నివసిస్తున్నారని, . మరో 1.40 లక్షల కుటుంబాలకు నిలువ నీడ కూడా లేదని తేలింది. గ్రామ వార్డు సచివాలయాల ద్వారా అనేక సర్వేలు నిర్వహిస్తున్నారు. ఇందులో ఇళ్లకు సంబంధించిన సర్వే ఒకటి. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని కుటుంబాలు ఉన్నాయి, వాటిలో ఎంతమందికి సొంత ఇళ్లు ఉన్నాయి, ఎంత మంది అద్దె ఇళ్లలో నివసిస్తున్నారు, మరెంత మంది నివాసానికి ఇళ్లే లేకుండా ఉన్నారు అన్న కోణంలో వివరాలు సేకరిస్తున్నారు. కార్యదర్శులు ఇంటింటికీ తిరిగి ఈ వివరాలను సాధికారికంగా సేకరిస్తున్నారు. ఈ సర్వేలో వెలుగుచూస్తున్న గణాంకాల మేరకు రాష్ట్రంలో 1,69,93,892 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో ఇప్పటికే 1,42,96,326 కుటుంబాల వివరాలు సేకరించారు.

వీటిలో 1.15 కోట్ల కుటుంబాలు సొంత ఇళ్లలోనే నివసిస్తున్నట్లు తేలింది. 27.29 లక్షల కుటుంబాలు ఇప్పటికీ సొంత ఇంటి కల నెరవేర్చుకోలేక అద్దెలు చెల్లిస్తూ కాలం వెళ్లదీస్తున్నట్లు కనిపిస్తోంది.

నగరాల్లోనే ఎక్కువ సమస్య

అద్దె ఇళ్లు, అసలు ఇళ్లే లేనివారి సమస్య నగరాల్లోనే అధికంగా ఉన్నట్లు సర్వే ద్వారా తెలుస్తోంది. అద్దె ఇళ్లలో ఉంటున్న వారి జాబితాలో గుంటూరు జిల్లా అగ్రస్థానంలో ఉండగా, కాకినాడ రెండో స్థానంలో, తూర్పు గోదావరి మూడో స్థానంలో ఉన్నాయి. అసలు ఇళ్లు లేని వారికి సంబంధించి అన్నమయ్య జిల్లా తొలి స్థానంలో, కోనసీమ రెండో స్థానంలో, పశ్చిమ గోదావరి మూడో స్థానంలో ఉన్నాయి.

ప్రేమికుల రోజే ఘాతుకం

- యువతిపై కత్తి, యాసిడ్‌తో ఉన్మాది దాడి
- బాధితురాలికి తీవ్రగాయాలు
- ఫోన్లో ఆరా తీసిన మంత్రులు లోకేష్, అనిత

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్/ గుర్రంకొండ (అన్నమయ్య జిల్లా)

ప్రేమికుల దినోత్సవం రోజునే దారుణం చోటుచేసుకుంది. సైకోలా మారిన యువకుడు తాను ప్రేమించిన యువతిపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. తాను ప్రేమించిన అమ్మాయి మరెవ్వరికీ దక్కకూడదని కత్తితో దాడి చేసి, ఆపై యాసిడ్ పోసి హత్యాయత్నానికి పాల్పడి పరారయ్యాడు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి



నిందితుడు గణేష్ (ఫైల్ ఫొటో)

చంద్రబాబు స్పందించారు. పోలీసుల కథనం ప్రకారం... అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలం ప్యారంపల్లెకు చెందిన జనార్ధన్, రెడ్డమ్మ దంపతులకు కుమార్తె గౌతమి, కుమారుడు రాజేష్ ఉన్నారు. గౌతమి డిగ్రీ వరకు చదువుకొని మదనపల్లె కదిరి రోడ్డులోని సంఘం ఫంక్షన్ హాల్ వద్దగల ఓ బ్యూటీ పార్లర్‌లో పని చేస్తుంది. మదనపల్లె అమ్మ చెరువుమిట్టకు చెందిన గణేష్ ప్రేమ పేరుతో ఆమె వెంట పడి వేధించేవాడు. తల్లిదండ్రులకు ఈ విషయం తెలియడంతో వారు తమ కుమార్తెను పని మాన్పించి ఇంటికే పరిమితం చేశారు. బంధువుల అబ్బాయికి ఇచ్చి వివాహం చేసేందుకు నిశ్చయించారు. ఈ నేపథ్యంలో ఈ నెల ఏడున గౌతమికి నిశ్చితార్థం అయింది. ఏప్రిల్ 29న వివాహం కానుంది. ఇది భరించలేని గణేష్ సైకోలా మారాడు. తాను ప్రేమించిన అమ్మాయి తనను కాదని మరో వ్యక్తిని వివాహం చేసుకోనుండడంతో జీర్ణించుకోలేకపోయాడు. స్నేహితునితో కలిసి శుక్రవారం తెల్లవారుజాము చీకట్లోనే యువతి స్వగ్రామం ప్యారంపల్లికి వెళ్లాడు. ఉదయం ఆరు గంటలకే తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగానే గౌతమి ఒంటరిగా ఉండటాన్ని గమనించి ఇంట్లోకి చొరబడ్డాడు. తననే పెళ్లి చేసుకోవాలని యువతితో వాగ్వాదానికి దిగాడు. వెంట తెచ్చుకున్న కత్తితో యువతిపై దాడి చేయడంతో మెడ, గొంతు, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. వెంట తెచ్చుకున్న యాసిడ్‌ను బలవంతంగా తాగించబోయాడు. ఆమె ప్రతిఘటించడంతో ముఖం మీద పోశాడు. దీంతో, గౌతమి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఆ తర్వాత నిందితుడు పరారయ్యాడు. గౌతమి కుప్పకూలి మిగతా 7లో

నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి : ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. బాధిత యువతికి, ఆమె కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

నిందితుడిని రక్షించేందుకు ప్రయత్నిస్తే ప్రజా ఉద్యమం : సిపిఎం

సైకో గణేష్‌ను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. నిందితుణ్ని రక్షించే ప్రయత్నం చేస్తే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

చిన్నషేర్లపై టారిఫ్ పంజా


- ఎనిమిదో రోజూ మార్కెట్లను వీడని నష్టాలు

ముంబయి : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్ ప్రకటనతో భారత స్టాక్ మార్కెట్లు వరుసగా ఎనిమిదిరోజూ కుదేలయ్యాయి. నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ బేర్ గుప్పిట్లో చిక్కుకుంది. 27 స్మాల్ క్యాప్ మ్యూచువల్ ఫండ్స్‌లో 26 సూచీలు కూడా నష్టాలను చవి చూశాయి. ఎంతో ఆశగా చిన్న షేర్లు, మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు కలిగిన రిటైల్ మదుపర్లు ఊహించని నష్టాలతో కన్నీరుమున్నీరవుతున్నారు. బిఎస్ఇ సెన్సెక్స్ ఓ దశలో దాదాపు 700 పాయింట్లు మేర నష్టపోగా.. నిఫ్టీ 23వేల దిగువన నమోదైంది. సెన్సెక్స్ ఉదయం లాభాల్లో ప్రారంభమైనప్పటికీ కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 75,440 కనిష్ఠాన్ని తాకింది. తుదకు 199 పాయింట్ల నష్టంతో 75,939కు పడిపోగా.. నిఫ్టీ 102 పాయింట్ల నష్టంతో 22,929 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, సన్‌ఫార్మా, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఎన్‌టిపిసి షేర్లు అధిక నష్టాలను చవి చూడగా.. నెస్లే ఇండియా, ఐసిఐసిఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, టిసిఎస్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

కొత్త సిఇసిగా జ్ఞానేష్ కుమార్?

- 18న రాజీవ్ కుమార్ పదవీ విరమణ
- 17న సెలక్షన్ కమిటీ భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



భారత నూతన ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్‌ను ఎంపిక చేయనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రస్తుత సిఇసి రాజీవ్ కుమార్ ఈ నెల 18న పదవీ విరమణ పొందుతున్నారు. ఈ నెల 17న సెలక్షన్ కమిటీ సమావేశమయ్యే అవకాశం ఉంది. ఈ కమిటీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదాలో రాహుల్ గాంధీ ఉన్నారు. సిఇసి, ఇసి ఎంపికకు సంబంధించిన కొత్త చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టడానికి ఒకరోజు ముందుగానే సిఇసి ఎంపిక ప్రక్రియ చేపట్టనుండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

జ్ఞానేష్ కుమార్ నేపథ్యం

జ్ఞానేష్ కుమార్ కేరళ కేడర్‌కు చెందిన 1988 బ్యాచ్ ఐఎఎస్ అధికారి. ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఇంతకు ముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆధ్వర్యంలోని సహకార మంత్రిత్వ శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖల కార్యదర్శిగా పని చేసి పదవీ విరమణ పొందారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఏర్పాటుతో సహా అయోధ్య కేసుపై సుప్రీం కోర్టు తీర్పునకు సంబంధించిన అన్ని విషయాలను చూసేందుకు హోం మంత్రిత్వ శాఖలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగానికి ఆయనే నేతృత్వం వహించారు.

పదవీకాలమంతా విమర్శలే..

రాజీవ్ కుమార్ తన పదవీకాలంలో ప్రతిపక్షాల నుంచి ఫిర్యాదులు ఎదుర్కొన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల విషయంలో బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శించాయి. ఇవిఎంల వినియోగంపై అనేక అభ్యంతరాలను లేవనెత్తాయి. లైవ్ ఓటింగ్ ట్రెండ్స్ పబ్లిష్ చేయడంలో ఇసి తీవ్ర జాప్యం చేసిందంటూ హర్యానా ఎన్నికల సమ యంలో కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఎలక్షన్ కమిషన్ పూర్తిగా బిజెపికి లొంగిపోయిందని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ముందు ఆప్ తీవ్ర విమర్శలు చేసింది.

స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కండి

- చంద్రబాబు పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపు నిచ్చారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవన ప్రమాణాలు పెంచడం, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం, పెట్టుబడులను ఆకట్టుకోవడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం , నెట్ జీరోకు రాష్ట్రంలో పర్యావరణాన్ని తీసుకురావడం వంటి వాటిని ప్రతి ఒక్కరూ లక్ష్యాలుగా పెట్టుకుని పనిచేయాలని అన్నారు. లక్ష్యాలు పెట్టుకోవడమే కాదని, వాటిని ఖచ్చితంగా చేరుకునేలా ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. ఈ నెలలో సోర్స్ రిసోర్స్ లక్ష్యంగా తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఎలా అభివృద్ధి సాధించాలనే దానిపై దృష్టి పెట్టాలని సూచించారు. సంపూర్ణ స్వచ్ఛత వైపు అడుగులు వేయడం, పారిశుధ్యానికి ప్రాధాన్యత, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్రజారోగ్యంతోపాటు కేంద్రం నిర్దేశించే లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని పేర్కొన్నారు. పర్యావరణ నిర్వహణ అంశంలోనూ సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అన్ని అంశాల్లోనూ ప్రజలు భాగస్వామ్యం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ దిశలో పట్టణాభివృద్ధిశాఖ, పంచాయతీరాజ్ విభాగాలు చేపట్టిన కార్యక్రమాల నివేదిక ఆధారంగా 14 అంశాల్లో జిల్లాలకు ర్యాంకులు ఇస్తున్నట్లు సిఎం ప్రకటించారు. వీటిల్లో ఎన్‌టిఆర్, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాలు వరుసగా మొదటి మూడు స్థానాల్లో ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కె.పట్టాభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ, విలువలకు మారుపేరు సంజీవయ్య

- నివాళులర్పించిన సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నిజాయతీకి, నిరాడంబరాత్వానికి, విలువలకు మారుపేరు దామోదరం సంజీవయ్య అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి సంజీవయ్య 104వ జయంతి సందర్భంగా ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి శుక్రవారం సిఎం పూలమాల వేసి, నివాళులర్పించారు. దేశంలోనే తొలిదళిత ముఖ్యమంత్రిగా పనిచేసిన సంజీవయ్య జీవిత ప్రస్థానం ఆద్యంతం స్ఫూర్తిదాయకం, ఆదర్శనీయమని, ఆయన జయంతి వేడుకలను అధికారికంగా జరుపుకోవడం తెలుగుజాతికి గర్వకారణమని అన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ఉమ్మడి రాష్ట్రానికి తొలి దళిత ముఖ్యమంత్రిగా సంజీవయ్య ఖ్యాతికెక్కారని మంత్రి నారా లోకేష్ తెలిపారు. నమ్మిన విలువలకు జీవితాంతం కట్టుబడిన వ్యక్తి అని, ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని అన్నారు.

రాజకీయ ముసుగులో నేరస్తులు

రాజకీయ నేతల ముసుగులో ఉన్న నేరస్తులు ప్రజాస్వామ్యానికే పెను ప్రమాదం అని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అందుబాటులో ఉన్న పార్టీ నేతలతో సమావేశమయ్యారు. రాజకీయ ముసుగులో ఉన్న నేరస్తులను ఏరివేయాల్సిన అవసరం ఉందన్నారు. గత ఐదేళ్లు రాష్ట్రం రావాణకాష్టంగా మారిందని పేర్కొన్నారు. ఆటవిక రాజ్యంలో దాడులు, ఊచకోతలు, విధ్వంసాలు, హత్యలు జరిగాయని తెలిపారు. తమది ప్రజాస్వామ్యం అని, ఇక్కడంతా చట్టపరంగానే పరిపాలన సాగుతోందని అన్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ఎవరికి ఇవ్వాలనే అంశంపై విశాఖ ఎంపి భరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎఎస్ రామకృష్ణతో కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా - గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మాజీ మంత్రి కెఎస్ జవహర్ తదితరులు పాల్గొన్నారు.


గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో రోగులను పరిశీలిస్తున్న కృష్ణబాబు

జిబిఎస్ కేసులను నియంత్రిస్తాం

- గుంటూరులో ఏడు నమోదు
- వారిలో ఇద్దరు డిశ్చార్జి
- సమీక్షించిన వైద్య, ఆరోగ్య శాఖ స్పెషల్ సిఎస్ కృష్ణబాబు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో గులియన్ బారే సిండ్రోమ్ (జిబిఎస్) కేసుల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి.కృష్ణబాబు తెలిపారు. జిబిఎస్ వ్యాధిగ్రస్తులు గుంటూరులోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఎక్కువగా ఉన్నారన్న సమాచారంతో శుక్రవారం ఆయన ఇక్కడికి వచ్చారు. మొత్తం ఏడు కేసులు జిజిహెచ్‌కు వచ్చాయని, వీరిలో ఐదుగురు చికిత్స పొందుతున్నారని, ఇద్దరి పరిస్థితి సీరియస్‌గా ఉందని వైద్యులు కృష్ణబాబుకు వివరించారు. వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లకు గురైన వారికి నరాల సమస్య వస్తుందన్నారు. దీనివల్ల పక్షవాతం కూడా రావచ్చని తెలిపారు. ఇప్పటికే తిరుపతి, కాకినాడ, విశాఖపట్నం, కర్నూలు, గుంటూరు తదితర నగరాల్లో 17 కేసులు నమోదయ్యాయి. ఈ సందర్భంగా మీడియాతో కృష్ణబాబు మాట్లాడుతూ లక్ష మందిలో ఇద్దరు ముగ్గురికి ఈ వ్యాధి వస్తుందన్నారు. ఒక్కో రోగికి చికిత్స కోసం రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని, హిమోగ్లోబిన్ ఇంజక్షన్లు రోజుకు ఐదు వరకు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఒక్కో ఇంజక్షను ధర రూ.20 వేల వరకు ఉందన్నారు. కోనసీమ, గిద్దలూరు, నరసరావుపేట, గుంటూరు తదితర ప్రాంతాల వారు ఏడుగురు చికిత్స నిమిత్తం రాగా. వారిలో ఇద్దరు డిశ్చార్జి అయ్యారని, ఇంకా ఐదుగురు చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఇటీవల పూణేలో 140 కేసులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైందన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యులను సంప్రదించాలన్నారు. గుంటూరులో చికిత్స పొందుతున్న బి.కమలమ్మ (40), ఐసియులో ఉన్న వి.ఆశీర్వాదం (50), షేక్ గౌర్జాన్ (65), వి.నాగవేణి (20) షేక్ రమీజాన్ (44)లను పరామర్శించారు. నరాలకు సంబంధించిన ఈ వ్యాధి తీవ్రతపై సమీక్షించారు. గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ సుందరాచారి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణతో చర్చించారు. హిమోగ్లోబిన్ ఇంజక్షన్లు అవసరమైన వారికి వెంటనే ఇవ్వాలని ఆదేశించారు. రోగుల పరిస్థితి నిలకడగా ఉందన్నారు. కృష్ణబాబు వెంట మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌విఎల్. నరసింహం, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి విజయలక్ష్మి ఉన్నారు.

రాకేష్ కుటుంబానికి అండగా ఉంటాం

- మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇటీవల ఏనుగుల దాడిలో మృతిచెందిన తిరుపతి జిల్లా చంద్రగిరి మండలానికి చెందిన రాకేష్‌చౌదరి కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. రాకేష్ కుటుంబ సభ్యులు ఉండవల్లిలోని మంత్రి నివాసంలో శుక్రవారం కలిశారు. పార్టీ కార్యకలాపాల్లో చురుగ్గా ఉండే రాకేష్ మరణించడం తనను కలచివేసిందని తెలిపారు.

దళితుల మీద దాడిపై జగన్ నోరు విప్పాలి

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళితులమీద దాడిపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నోరు విప్పాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'నా దళితులు' అంటూ మాట్లాడే జగన్‌కు అసలు దళితులపై ప్రేమే లేదని అన్నారు. దళితుడైన సత్యవర్ధన్‌ను వైసిపి నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ కిడ్నాప్ చేసి దారుణంగా కొట్టారని, టిడిపి కార్యాలయంపై దాడి కేసు ఉపసంహరించుకునేలా ఒత్తిడి చేశారని చెప్పారు. వైసిపి నాయకుల తీరు మారడం లేదని అన్నారు. నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. దళితులు, మహిళలపై అనుచితంగా ప్రవర్తించే వంశీనే జగన్‌కు ఎక్కువా? అని ప్రశ్నించారు. దళితుడిని కిడ్నాప్ చేసి వంశీ తన ఆధీనంలో పెట్టుకుంటే ఎందుకు ఖండించడం లేదో చెప్పాలన్నారు. వంశీ జైలుకు వెళ్లడానికి కారణం జగనే అని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మరో సమావేశంలో విమర్శించారు. జలవనరుల శాఖ మంత్రిగా ఉండి పోలవరాన్ని నాశనం చేసిన అంబటి రాంబాబు... వంశీ గురించి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వంశీ చేయని అరాచకం, కబ్జా లేదని మాజీ మంత్రి కెఎస్ జవహర్ అన్నారు.

అభియోగాలపై వైసిపి నేతల వివరణ

ప్రజాశక్తి-అమరావతి

అటవీ భూముల ఆక్రమణ అభియోగాలపై వివరణ ఇవ్వాలని అధికారులు ఇచ్చిన నోటీసులను వైసిపి నేతలు, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు, రాజంపేట ఎంపి మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, పి ఇందిరమ్మ వేర్వేరుగా హైకోర్టులో వ్యాజ్యాలను దాఖలు చేశారు. చిత్తూరు జిల్లా, పులిచెర్ల మండలం, మంగళంపేట గ్రామ పరిధిలోని అటవీ భూములను ఆక్రమణలపై వివరణ ఇవ్వాలనే నోటీసులను రద్దు చేయాలని, తమ భూముల్లో అధికారులు జోక్యం చేసుకోకుండా ఉత్తర్వులివ్వాలని కోరారు. ఈ కేసులో అధికారులు తీసుకునే చర్యలు చట్ట నిబంధనలకు లోబడి ఉండాలని హైకోర్టు చెప్పింది. కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశించింది. విచారణను మార్చి 6కు వాయిదా వేస్తూ జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ శుక్రవారం ఆదేశించారు. అటవీ భూమి విషయంలో వివరణ ఇవ్వాలన్న అధికారుల నోటీసులను సవాల్ చేస్తూ వారంతా వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. సీనియర్ న్యాయవాది సివి మోహన్‌రెడ్డి వారి తరపున వాదించారు.

శ్రీరెడ్డి పిటిషన్లపై హైకోర్టు విచారణ

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలోని వివిధ పిఎస్‌లలో నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ సినీనటి మల్లిడి విమల అలియాస్ శ్రీరెడ్డి.. హైకోర్టును ఆశ్రయించారు. వాటిలో మూడు పిటిషన్లను హైకోర్టు జస్టిస్ కె శ్రీనివాస్‌రెడ్డి విచారించారు. శ్రీరెడ్డిపై నమోదైన కేసుల వివరాలను తమ ముందుంచాలని గుంటూరు నగరపాలెం, విశాఖపట్నం టూ టౌన్, కాకినాడ సర్పవరం పోలీసులను ఆదేశించారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, అనితను ఉద్దేశించి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ శ్రీరెడ్డిపై పలు పిఎస్‌లలో నమోదైన కేసులను కొట్టేయాలని ఆమె హైకోర్టును ఆశ్రయించారు.



విశాఖలో నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ

బీమా రంగంలో విదేశీ పెట్టుబడులపై నిరసనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

బీమా రంగంలో విదేశీ పెట్టుబడులు వంద శాతానికి పెంచుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించడాన్ని నిరసిస్తూ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఐసిఆర్‌ఇఎ) ఆధ్వర్యంలో ఎల్‌ఐసి పెన్షనర్లు శుక్రవారం పలు జిల్లాల్లో నిరసనలు తెలిపారు. ఈ ప్రతిపాదనలు దేశ ఆర్థిక స్వావలంబనకు విరుద్ధమని ఆందోళన వ్యక్తం చేశారు. బీమా రంగాన్ని విదేశీ పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడాలని డిమాండ్ చేశారు. విశాఖలోని ఎల్‌ఐసి డివిజనల్ కార్యాలయం వద్ద ఆందోళనలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ.. ఇన్సూరెన్స్ రంగంలో వంద శాతం విదేశీ పెట్టుబడికి అనుమతి ఇవ్వడం మంచిది కాదన్నారు. దేశీయ పొదుపుపై విదేశీ పెత్తనం ప్రమాదకరమని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, ఆర్థిక ప్రగతికి నష్టమని పేర్కొన్నారు. అందుకే దీనిని దేశవ్యాప్తంగా ఇన్సూరెన్స్ రంగంలోని ఏజెంట్లు, ప్రజలు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ పెన్షనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.మోహన్‌రావు, నాయకులు బిబి.గణేష్, ఏజెంట్ల సంఘాల నాయకులు ఎన్ఆర్.ఠాగూర్, ఎ.తిరుమలరావు పాల్గొన్నారు. అనకాపల్లి ఎల్‌ఐసి కార్యాలయం వద్ద, శ్రీకాకుళం నగరంలోని ఎల్‌ఐసి బ్రాంచ్ కార్యాలయం వద్ద బీమా రంగం రిటైర్డ్ ఉద్యోగులు ధర్నా చేశారు. వంద శాతం ప్రతిపాదనలను రద్దు చేయాలని, ఎల్‌ఐసిలో ఉద్యోగాలను భర్తీ చేయాలని, జిఐసి ఉద్యోగుల వేతన సవరణ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు.

వంశీకి 14 రోజులు రిమాండ్

- విజయవాడ జైలుకు తరలింపు

ప్రజాశక్తి - విజయవాడ



టిడిపి కార్యాలయంపై దాడి, కిడ్నాప్, బెదిరింపు కేసుల్లో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి 14 రోజులపాటు జ్యుడీషియల్ రిమాండ్ ఇస్తూ విజయవాడ నాలుగో చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో వంశీని పోలీసులు విజయవాడ సబ్ జైల్‌కు తరలించారు. ఇదే కేసులో వంశీతోపాటు మరో ఇద్దరు నిందితులైన లక్ష్మీపతి, కృష్ణప్రసాద్‌నూ అరెస్టు చేసి జైలుకు తరలించారు. ప్రభుత్వం తరపున రాజేంద్రప్రసాద్, నిందితుల తరపున మాజీ ఎఎజి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు.

కస్టడీ పిటిషన్ వేసిన పోలీసులు

వంశీని పది రోజుల కస్టడీ కోరుతూ పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆయన ఫోన్‌ను స్వాధీనం చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌ను కోర్టు సోమవారం విచారించనుంది.

పోలీసుల నుండి ప్రాణహాని ఉంది : వంశీ

రాష్ట్ర పోలీసుల నుంచి తనకు ప్రాణ హాని ఉందని మాజీ ఎమ్మెల్యే వంశీ న్యాయమూర్తికి ఫిర్యాదు చేశారు. 'నాకు శ్వాసకోశ ఇబ్బంది ఉందని చెబుతున్నా పోలీసులు నా పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. అరెస్టు విషయంలో పూర్తిగా సహకరించినా నన్ను ఇబ్బందులకు గురిచేశారు. నాకు వైద్య సహాయం అందకుండా పోలీసులు ప్రతిక్షణం అడ్డుకున్నారు. అరెస్ట్ నుంచి కోర్టుకు తరలించే వరకు పోలీసులు నా పట్ల అనుచితంగా ప్రవర్తించారు' అంటూ న్యాయమూర్తికి స్టేట్‌మెంట్ ఇచ్చారు. కాగా, విజయవాడ జైల్లో ఉంటే వంశీ ప్రాణాలకు ముప్పు ఉంటుందని ఆయన కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదాని గంగవరం పోర్టును నోటిఫైడ్ ఏరియాగా ప్రకటించడం తగదు : సిపిఎం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

అదాని గంగవరం పోర్టు నోటిఫైడ్ ఏరియా కమిటీని పునర్నియమిస్తూ మరో మూడేళ్ల పాటు ఆ పోర్టును నోటిఫైడ్ ఏరియాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో వ్యతిరేకించారు. జివిఎంసి ఆదాయాన్ని దెబ్బ తీసి అదానికి కోట్లాది రూపాయలు మేలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ చర్యకు పాల్పడిందని, తక్షణం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని టిడిపి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ చట్టం - 1965లోని 389 - ఎ, సెక్షన్ 2డిని ఉపయోగించుకొని నోటిఫైడ్ ఏరియాగా జిఒ 22 ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిందని పేర్కొన్నారు. కనీసం జివిఎంసి కౌన్సిల్ అభిప్రాయం కూడా తీసుకోకుండా ఈ చర్యకు ప్రభుత్వం పాల్పడిందని తెలిపారు. ఈ ఉత్తర్వుల వల్ల అదాని గంగవరం పోర్టు మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధి నుంచి పూర్తిగా మినహాయింపబడుతుందని పేర్కొన్నారు. ఈ నోటిఫైడ్ కమిటీకి చైర్మన్‌గా అదాని పోర్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌నే ప్రభుత్వం నియమించిందని తెలిపారు. జివిఎంసికి చట్టబద్ధంగా చెల్లించాల్సిన ఆస్తి పన్ను, భవన నిర్మాణ రుసుములు, ట్రేడ్ లైసెన్సు వంటి అనేక పన్నులు ఈ చర్య ద్వారా మినహాయించబడతాయని పేర్కొన్నారు. పోర్టు చెల్లించాల్సిన సుమారు రూ.60 కోట్లను వివిధ రకాల పన్నుల రూపంలో జివిఎంసి నష్టపోతుందని, వాస్తవంగా అదాని పోర్టుకు ఏడాదిలో వచ్చే ఆదాయంలో కనీసం నాలుగు శాతం ఆస్తి పన్ను చెల్లించాలని తెలిపారు. గత ఏడాది రూ.1400 కోట్లు ఆదాయం సమకూరిందని, దీని ప్రకారం ఆస్తి పన్నునే కనీసం రూ. 56 కోట్లు చెల్లించాల్సి ఉందని, కానీ కేవలం రూ.37 లక్షలే ఆ పోర్టు చెల్లించిందని పేర్కొన్నారు. అదే విశాఖ పోర్టు ఏడాదికి ఆస్తి పన్ను రూపంలో జివిఎంసికి రూ.80 కోట్లకుపైన చెల్లిస్తోందని గుర్తుచేశారు. విలువ ఆధారిత పన్ను వసూలు ద్వారా సామాన్య, మధ్య తరగతి ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఆస్తి పన్నులు వసూలు చేస్తూ, అదానికి రాయితీలు కల్పించడం దుర్మార్గమని పేర్కొన్నారు. అదాని పోర్టు వాహనాల వల్ల గాజువాక రోడ్లు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, ఆ రోడ్ల అభివృద్ధికి జివిఎంసి తిరిగి రూ.15 కోట్లకుపైగా ఖర్చు పెట్టాల్సి వస్తుందని తెలిపారు. జివిఎంసిపై ఒత్తిడి తీసుకొచ్చి అదాని పోర్టు అత్యంత చౌకగా గోదావరి నీటిని కిలో లీటరుకు రూ.30 మాత్రమే చెల్లిస్తోందని, విశాఖ పోర్టు మాత్రం రూ.70 చెల్లిస్తోందని వివరించారు.

అపార్టుమెంట్ వాసులకు సైతం కిలో లీటరుకు స్లాబ్ రూపంలో రూ.30కిపైన నీటి ఛార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం గంగవరం పోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న 10.4 శాతం వాటాను అదాని పరం చేసిందని, అప్పుడు ఆ చర్యను చంద్రబాబు తీవ్రంగా వ్యతిరేకించారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అదాని సేవలో మునిగి తేలుతున్నారని విమర్శించారు. పెద్ద ఎత్తున భూములను, విద్యుత్ రంగాన్ని అదానిపరం చేసే చర్యలకు ఒడిగడుతున్నారని పేర్కొన్నారు.


శ్రీవారి లడ్డు కల్తీ వ్యవహారంలో.. నిందితులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంలో అరెస్టయిన నలుగురు నిందితులకు తిరుపతి రుయా ఆస్పత్రిలో వైద్యపరీక్షలు పూర్తయ్యాయి. నిందితులు ఎఆర్ డెయిరీ ఎండి రాజశేఖరన్, భోలేబాబా డెయిరీ మాజీ డైరెక్టర్లు విపిన్ జైన్, పోమిల్ జైన్, శ్రీవైష్ణవి డెయిరీ సిఇఒ అపూర్వ వినయ్‌కాంత్ చావ్డాను ఐదురోజులపాటు సిట్ కస్టడీకి అప్పగిస్తూ కోర్టు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీంతో శుక్రవారం ఉదయం వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నిందితులను తిరుపతిలోని సిట్ కార్యాలయానికి తరలించారు. కస్టడీలో సిట్ అధికారులు ఏయే ప్రాంతాల్లో నెయ్యిని కల్తీ చేశారు? నెయ్యి కల్తీ చేయాలని ఎవరైనా మీకు చెప్పారా? అని ప్రశ్నించినట్లు సమాచారం. బోలేబాబా డెయిరీ నుంచి తిరుపతికి తీసుకువచ్చిన నెయ్యి ట్యాంకర్లలో ఎంత శాతం కల్తీ కలిసిందని సిట్ అధికారులు ప్రశ్నించారు. ఏఆర్ డెయిరీ రాజశేఖర్‌తో ఎప్పటి నుంచి పరిచయం ఉంది? కల్తీ నెయ్యి సరఫరా చేసి ఎంత కమీషన్ పొందారు? మీకు సపోర్ట్ చేసిన రాజకీయ నేత ఎవరు? అని సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ విచారణ 14 నుంచి 18వ తేదీ వరకు విచారణ జరగనుంది.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు (గుంటూరు జిల్లా)


బాబురావు (ఫైల్)

అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసిన కౌలు రైతు చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం వంగిపురం గ్రామానికి చెందిన వరగాని బాబురావు (59) తనకున్న 40 సెంట్ల పొలంతోపాటు మరో మూడెకరాలను కౌలుకు తీసుకుని మూడేళ్లుగా పత్తి, మిర్చి సాగు చేస్తున్నారు. ఇందుకోసం అప్పులు చేశారు. పంటలు పండినా ఆదాయం సరిగా రాకపోవడంతో అప్పులు తీర్చడం కష్టమైంది. రుణ దాతల నుంచి ఒత్తిళ్ల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. దీంతో గురువారం సాయంత్రం తన పొలం వద్దకెళ్లి పురుగుల మందు తాగి చిన్న కుమారుడికి ఫోన్ చేసి ఈ విషయం చెప్పారు. కుటుంబ సభ్యులు పొలం వద్దకు చేరుకునేసరికి బాబురావు అపస్మారకస్థితిలో ఉన్నారు. వెంటనే ఆయనను గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. బాబురావుకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.నాగేంద్ర కేసు నమోదు చేశారు.



ఐక్యత చాటుతున్న ఎబిఎఎం సంఘం నాయకులు

'వాగ్రివేల్' కమ్యూనిటీగా గుర్తించండి

- ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి
- ఎబిఎఎం సంఘం జాతీయ సమ్మేళనం డిమాండ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఆయా ప్రాంతాల వాడుక భాషలలో వివిధ రకాలుగా పిలుస్తున్న షికారీలను ఇకపై 'వాగ్రివేల్' కమ్యూనిటీగా గుర్తింపు ఇవ్వాలని, ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ ఆదిమ మహా సంఘం (ఎబిఎఎం) జాతీయ అధ్యక్షులు రూప్ సింగ్ బాయ్ బార్భీడియా, తెలంగాణ రాష్ట్ర టిడిపి ఎస్‌టి సెల్ అధ్యక్షులు గోపి కాలే, ఎబిఎఎం సంఘ జాతీయ మహిళా అధ్యక్షులు కుముదా సుశీలప్ప డిమాండ్ చేశారు. తిరుపతిలోని గిరిజన భవన్‌లో అఖిల భారతీయ ఆదిమ మహా సంఘం జాతీయ సమ్మేళనం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా షికారీలను వాగ్రి దేవిపూజక్, పార్ధి, వాగ్రి జాతులు, హక్కి పిక్కి, కురువికారన్, నరికోరవన్, షికారి, నీర్షికారి, పిట్టలోళ్ళు, గువ్వలోళ్ళు, నక్కలోళ్ళు ఇలా సమాజంలో పిలవబడుతున్నారని, ఈ పేర్లతో హేళనగా పిలవడంతో అవమానభారంగా ఉందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న షికారీలను వాగ్రివేల్ కమ్యూనిటీగా గుర్తించి ప్రభుత్వ ఫలాలను అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నోసార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లినా పరిష్కారం చూపలేదన్నారు. తమ జాతులకు సంబంధించిన వారికి ప్రభుత్వాలు రూపొందించే బడ్జెట్లో నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్నా.. ఆ నిధులు తమకు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ సమాజంలో బతుకు ఈడుస్తున్నామని తెలిపారు. ప్రభుత్వాలు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


అనంత బాలోత్సవంలో ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

సంబరంగా 'అనంత బాలోత్సవం'

ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

అనంతపురం బాలోత్సవం-5 వేడుకలు నగరంలోని లలిత కళాపరిషత్, గిల్డ్ ఆఫ్ స్కూల్‌ల్లో ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు ఈ పిల్లల పండుగ జరగనుంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతపురం జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ సుదర్శన్ రావు హాజరయ్యారు. అనంత బాలోత్సవ పతాకాన్ని కమిటీ అధ్యక్షులు షమీమ్ షఫీవుల్లా ఆవిష్కరించారు. లలితా కళా పరిషత్ హాలులో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. చదువుల ఒత్తిడి పెరిగిన ఇటువంటి సమయంలో పిల్లల్లో ఉత్సాహాన్ని నింపేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం ఆహ్వానించదగినదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రాథమిక విద్యను ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు చేపడుతోందని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ.. 'కుల మతాలు మనకొద్దు... విజ్ఞాన శాస్త్రం ముద్దు.' అని పిల్లలతో చెప్పించి వారిని ఉత్సాహపరిచారు. ఈ పోటీలు భారత సమైక్యతను చాటే విధంగా ఉండాలని సూచించారు. మొదటి రోజు వందకుపైగా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కల్చరల్ పోటీలన్నీ లలిత కళా పరిషత్‌లో జరుగగా, అకడమిక్ పోటీలు గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్లో నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ కార్యదర్శి శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శి సావిత్రి, కోశాధికారి మహమ్మద్ జిలాన్, లలిత కళాపరిషత్ అధ్యక్షురాలు పద్మజ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు లాభం చేకూర్చే బడ్జెట్

- బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఆందోళనలు

ప్రజాశక్తి- యంత్రాంగం

కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు, పెత్తందారులకు లాభం చేకూరే విధంగా ఉందని, ప్రజారంజకంగా లేదని పలువురు వక్తలు పేర్కొన్నారు. అనంతపురం క్లాక్ టవర్ వద్ద సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్, న్యూ డెమోక్రసీ, ఎస్‌యుసిఐల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. నెల్లూరులో 'ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ని తిరస్కరించండి' అని రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ..ఈ బడ్జెట్ వల్ల కలిగే నష్టాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 14 నుంచి 20వ వరకు జాతీయ స్థాయిలో దేశ వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా నగరంలో ఈ రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను వామపక్ష పార్టీలైన సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, ఫార్వాడ్ బ్లాక్ వంటి పార్టీలు, ప్రజా సంఘాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఉపాధి హామీ బకాయిలు విడుదల చేయాలని, 200 రోజులు పని కల్పించాలని, రూ. 500 రోజువారీ వేతనం అందజేయాలని కార్మికులు దశల వారీగా పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ఈ సమస్యపై నేటికీ కేంద్ర ప్రభుత్వం పరిష్కార మార్గం చూపలేదని, పైగా ఉపాధి హామీ చట్టంలో ఉన్న లొసుగులను ఉపయోగించుకొని బడ్జెట్ కేటాయింపులు తగ్గించడాన్ని వామపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తేనే అంగన్‌వాడీల శ్రమకు తగిన విధంగా వేతనాలు అందజేయడం సాధ్యమవుతుందన్నారు. వ్యవసాయ రంగానికి రూ. లక్షా డెబ్బయి తొమ్మిది కోట్లు నిధులు కేటాయించారని, ఈ నిధులతో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్నాయని ప్రకటించడం దారుణమన్నారు. దేశాభివృద్ధి ఒక్క వ్యవసాయ రంగంతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం, సిపిఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు పాల్గొన్నారు.

తులసిబాబు పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు నగరపాలెం పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ ఇవ్వాలంటూ తులసిదాసు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఎంపిగా ఉండగా తనను పోలీసులు కస్టడీలోకి తీసుకుని చిత్రహింసలు పెట్టారంటూ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు పెట్టిన కేసులో తులసిబాబుతో సహా పలువురిపై పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. ఈ కేసులో తులసిబాబును పోలీసులు అరెస్టు చేశారు. బెయిల్ ఇవ్వాలనే పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది.

'వీరరాఘవరెడ్డి ఆర్ఎస్ఎస్ కాదు'

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చిలుకూరు బాలాజీ అర్చకులు రంగరాజన్‌పై దాడి చేసిన వీరరాఘవరెడ్డి ఆర్ఎస్ఎస్, పరివార్ సంస్థలకు చెందిన వ్యక్తి కాదని సామాజిక సమరసత జాతీయ కన్వీనర్ శ్యామ్‌ప్రసాద్, సీనియర్ పాత్రికేయులు దుగ్గరాజు శ్రీనివాసరావు, ఎ జయప్రకాష్, సన్నిధానం శాస్త్రి, రాకా సుధాకర్, అగ్ని ఎడిటర్ రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. రంగరాజన్‌పై దాడిని ఖండిస్తూ ఆర్ఎస్ఎస్ ప్రచార విభాగం కూడా ప్రకటన చేసిందని తెలిపారు.

పంట కాలువల నిర్వహణ ప్రైవేట్‌కు ఇవ్వొద్దు

- ముందుకెళ్తే ప్రతిఘటన తప్పదు : ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో


రాష్ట్రంలో పంట కాలువల నిర్వహణ ప్రైవేట్‌కు ఇచ్చే ఆలోచన విరమించుకోవాలని, అలా కాకుండా ముందుకెళ్తే ప్రతిఘటన తప్పదని ప్రభుత్వాన్ని ఎపి రైతు సంఘం హెచ్చరించింది. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, రాష్ట్ర కార్యదర్శి కె ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ జలవనరులశాఖ నిర్వహణలో సమర్ధత లేకపోతే సమర్ధతను ఎలా పెంచుకోవాలో ఆలోచన చేయాలే తప్ప కాలువల నిర్వహణ ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలనే ఆలోచనను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. భూముల ప్రైవేటీకరణ, రహదారుల ప్రైవేటీకరణ, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ అంటూ అన్నింటినీ ప్రైవేట్ సంస్థలకు ఇవ్వాలనే ఆలోచన కొత్తది కాదని, గతంలో ప్రపంచ బ్యాంక్ కనుసన్నల్లో చంద్రబాబు పాలన 1996-2004 కాలంలోనే ఇది ముందుకు వచ్చిందని అన్నారు. అప్పట్లోనే అది విఫల ప్రయత్నంగా రుజువైందన్నారు. గోదావరి-బనకచర్ల కార్పొరేషన్ ఏర్పాటుచేసి ఆ కార్పొరేషన్ ద్వారా రుణాల రూపంలో నిధులు సమీకరిస్తామని చెప్పడం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కార్పొరేషన్ల పేరుతో ఏకంగా లక్షల కోట్లు అప్పు చేశారో తిరిగి అదే బాటలో చంద్రబాబు పయనిస్తున్నట్లు స్పష్టమవుతోందన్నారు.

'శ్రీవారి సేవ' వాట్సప్ గ్రూపుతో అక్రమాలు

- నిందితుడిపై కేసు నమోదు

ప్రజాశక్తి - తిరుమల

'శ్రీవారి సేవ' వాట్సప్ గ్రూపు పెట్టుకుని అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తిపై తిరుమల పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన మండల లక్ష్మి శేషవేణమ్మ తన బృందం కోసం ఆన్‌లైన్‌లో శ్రీవారి సేవ పాస్‌లను బుక్ చేసుకోడానికి ప్రయత్నించి చాలాసార్లు విఫలమయ్యారు. వాట్సప్ గ్రూప్ అడ్మిన్ కృష్ణారావు పోస్టు చేసిన శ్రీవారి సేవ వాట్సప్ గ్రూపులో శ్రీవారి సేవకు సంబంధించిన మెసేజ్‌లను చూసి ఆయన్ను సంప్రదించారు. శ్రీవారి సేవ పాస్‌లు బుక్ చేయాలంటే ఒక్కొక్కరికి రూ.800 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సేవ ఉచితం అని తెలియక ఆమె తన భర్త పేటిఎం ద్వారా 14 మంది భక్తులకుగానూ రూ.11,200లను కృష్ణారావు పేటిఎం ((8179687625)కు బదిలీ చేశారు. నగదు బదిలీ అనంతరం ఆయన నుంచి శ్రీవారి సేవా పాస్‌లను అందుకున్నారు. అయితే, శ్రీవారి సేవ కోసం తిరుమల చేరుకోగానే ఈ సేవ పూర్తిగా ఉచితమని తెలుసుకున్నారు. మోసాన్ని గ్రహించి కృష్ణారావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితురాలు తిరుమలలోని విజిలెన్స్ వింగ్ కార్యాలయాన్ని ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దీంతో తిరుమల పోలీసులు కృష్ణారావుపై కేసు నమోదు చేశారు.



బావిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

బావిలోకి దూసుకెళ్లిన కారు

- ఒకరు మృతి

ప్రజాశక్తి-నార్పల (అనంతపురం)

కారు టైరు పేలడంతో అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ సంఘటన అనంతపురం జిల్లా నార్పల మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం నగరం మారుతీ నగర్‌కు చెందిన షాబుద్దీన్ (40), ఇమ్రాన్‌లు ఓ పని నిమిత్తం శుక్రవారం ఉదయం అనంతపురం నుంచి తాడిపత్రికి కారులో బయల్దేరారు. నార్పల మండలం నడిమిదొడ్డి వద్ద కారు ముందు టైరు పేలిపోయింది. దీంతో అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న బావిలో కారు పడిపోయింది. ఈ ప్రమాదంలో షాబుద్దీన్ అక్కడికక్కడే మరణించారు. ఇర్ఫాన్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న నార్పల పోలీసులు, స్థానికులు, జెసిబి సాయంతో కారును బావి నుంచి బయటికి తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకం

- పిసిసి వైస్ ప్రెసిడెంట్ శివాజీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైందని పిసిసి వైస్ ప్రెసిడెంట్ కొలనుకొండ శివాజీ పేర్కొన్నారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఎపియుడబ్ల్యుజె-2025 డైరీ ఆవిష్కరణ జరిగింది. ఎపియుడబ్ల్యుజె అర్బన్ అధ్యక్షులు చావా రవి అధ్యక్షతన జరిగిన సభలో శివాజీ మాట్లాడుతూ.. బుడమేరు వరదల సమయంలో జర్నలిస్టుల కృషి అనన్యసామాన్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఐజెయు కౌన్సిల్ మెంబరు షేక్ బాబు, విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కంచల జయరాజ్, యూనియన్ అర్బన్ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి దాసరి నాగరాజు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఎపి ఫొటో జర్నలిస్ట్ (ఎపిపిజెఎ) రాష్ట్ర అధ్యక్షులు విజయభాస్కర్ పాల్గొన్నారు.

మిర్చి రైతుకు నష్టాల ఘాటు



- గతేడాది కన్నా క్వింటాలుకు రూ.10 వేల తగ్గుదల
- వారం రోజుల్లో రూ.3 వేల క్షీణత
- చోద్యం చూస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గిట్టుబాటు ధర రాక, ఇళ్లల్లో నిల్వ చేసుకునేందుకు అవకాశం లేక ఈ ఏడాది మిర్చి రైతులు అల్లాడుతున్నారు. ఎకరాకు లక్షన్నర రూపాయల నుంచి రెండు లక్షల రూపాయల వరకు పెట్టుబడి అవుతోంది. 15 క్వింటాలు కూడా దిగుబడి రావడం లేదు. గిట్టుబాటు ధర లభించకపోవడం లేదు. దీంతో, తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది ఫిబ్రవరిలో క్వింటాలుకు రూ.18 వేల నుంచి రూ.20 వేల వరకు ధర పలికింది. ప్రస్తుత ఏడాది రూ.9 వేలకు నుంచి రూ.13 వేల మించి ధర లభించడం లేదు. గత వారం రోజుల్లో క్వింటాలుకు రూ.3 వేలు తగ్గింది. అయినా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయి. వాణిజ్య పంటల్లో పొగాకు, తేయాకు, పసుపు తదితర పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటిస్తోంది. మిర్చికి మాత్రం ప్రకటించడం లేదు. దీంతో, వ్యాపారుల దాయాదక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోంది. 2018 నుంచి 2023 వరకు ధరలు మెరుగ్గా ఉన్నాయి. గత ఐదేళ్లలో సగటు ధర రూ.18 వేలకు తగ్గలేదు. గరిష్టంగా రూ.27 వేల వరకూ పలికింది. గతేడాది నుంచి ధరల తగ్గుదల ప్రారంభమైంది. గతేడాది కనీస ధర రూ.12 వేల గరిష్ట ధర రూ.20 వేల వరకు వచ్చింది. ప్రస్తుత ఏడాది కనీస ధర రూ.9 వేలు, గరిష్ట ధర రూ.13 వేలు మాత్రమే వస్తోంది. తేమ శాతం, తాలు సాకులు చూపి ధరను రూ.7 వేలకు కూడా తగ్గించేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఎగుమతులు లేవని చెబుతున్న వ్యాపారులు రోజుకు లక్ష టిక్కిలు వచ్చినా కొనేస్తున్నారని, తాము పండించిన సరుకు అంతా ఎటుపోతుందోనని ప్రశ్నిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో రిటైల్ ధర కిలో రూ.200 నుంచి రూ.220 వరకు పలుకుతుండడాన్ని వారు గుర్తు చేస్తున్నారు. వారం రోజులుగా యార్డుకు సగటున రోజు 90 వేల నుంచి లక్ష టిక్కిల వరకు సరుకు వస్తోంది. ధరల తగ్గుదలపై రైతులు జిల్లాలోని ప్రజాప్రతినిధులపై రైతులు ఒత్తిడి తేగా, స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం తమ ఆర్థిక పరిస్థితి బాగా లేదని రైతులను ఆదుకోవాలని సిఎం చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల టిడిపి ఎంపిలు, ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ నాయకులు లావు శ్రీకృష్ణదేవరాయలు ఢిల్లీలోని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాలని కేంద్రం ప్రతిపాదించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని, మొత్తం కేంద్రమే భరించాలని ఎంపిలు కోరారు. ఈ అంశంపై ఇంతవరకూ కేంద్రం నుంచి స్పందన లేదు. తక్షణం క్వింటాలుకు రూ.12 వేలు తగ్గకుండా మార్కెట్ ఇంటర్ వెన్షన్ పథకం కింద సాయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. కేంద్రం ఇంతవరకు సానుకూలంగా స్పందించకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.15 వేలు ప్రకటించాలని వారు కోరుతున్నారు.

ధరలు తగ్గడానికి కారణాలు తెలుసుకోవాలి



మిర్చి ధరలో ఎంత భారీ వ్యత్యాసం ఎందుకు వచ్చిందో ప్రభుత్వం అధ్యయనం చేయాలి. సీజన్ మొదట్లోనే ధర తగ్గితే చివరికి ఎంత పతనం అవుతుందోనని ఆందోళనగా ఉంది. నష్టాలను భరించలేము. గిట్టుబాటు ధర కల్పించాలి.

విప్పల ఆంజనేయరెడ్డి, మందపాడు, మేడికొండూరు మండలం

ఇష్టారాజ్యంగా అరాచకాలు

- వైసిపి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : కూటమి నేతలు ఇష్టారాజ్యంగా అరాచకాలు చేస్తున్నారని వైసిపి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వల్లభనేని వంశీ అరెస్టు అన్యాయమన్నారు. పాలన చేతగాక ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇలాంటి చర్యలకు దిగుతున్నారని పేర్కొన్నారు. తొమ్మిది నెలలుగా అనైతిక, అసమర్థ పాలన సాగుతోందని వివరించారు. టిడిపి ఆఫీసుపై దాడి కేసులో అసలు నిందితుడు పట్టాభి అని తెలిపారు. రాష్ట్రంలో మహిళలకు, మందిరాలకు రక్షణ లేదని, వ్యవస్థలన్నీ ధ్వంసమయ్యాయని, ఆర్థికశాఖపై పట్టులేకుండా పోయిందని అన్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే ఇబ్బందులు తప్పవు

పోలీసులు చట్టాన్ని అతిక్రమించి, టిడిపికి వత్తాసు పలికితే భవిష్యత్‌లో ఇబ్బందులు పడతారని వైసిపి లీగల్‌సెల్ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి తెలిపారు. తప్పుడు కేసులో వంశీని అరెస్టు చేశారని, దీనివెనుక కుట్రకోణం ఉందని అన్నారు. సత్యవర్ధన్ స్టేట్‌మెంట్ ఆధారంగా వంశీని అరెస్టు చేశామని చెప్పిన దానిలో వాస్తవం లేదన్నారు.

సోదరులే చంపేశారు

- సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లా తెర్లాం మండలం నెమలాం గ్రామ శివారులో ఈ నెల 10న జరిగిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కోనారి ప్రసాద్ (28) హత్య మిస్టరీని పోలీసులు ఛేదించారు. వరుసకు సోదరులైన పెద్దనాన్న కుమారులే ఈ దారుణానికి ఒడిగట్టారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌పి వకుల్ జిందాల్ ఈ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ దారుణానికి ప్రసాద్ పెదనాన్న కుమారులు కోనారి అచ్యుతరావు (32), కోనారి శివకృష్ణ (27) ఒడిగట్టినట్లు విచారణలో తేలింది. అచ్యుతరావు భార్య వెంకటలక్ష్మితో ప్రసాద్‌కు వివాహేతర సంబంధం ఉన్నట్లు నిందితులకు తెలియడంతో ఆయనను హతమార్చాలని పన్నాగం పన్నారు. ఫిబ్రవరి ఏడున గ్రామంలోకి ప్రసాద్ వచ్చినట్లు నిందితులు తెలుసుకున్నారు. పదవ తేదీ అచ్యుతరావు ఇంటికి ప్రసాద్ వచ్చారు. అక్కడి నుంచి తన మేనమామ ఊరు బూరిపేట గ్రామానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తమను కలవాలని నిందితులిద్దరూ ప్రసాద్‌ను కోరారు. బూరిపేట గ్రామ సమీపంలోని రేవడి పొలాల వద్ద అందరూ కలుసుకున్నారు. పథకం ప్రకారం ప్రసాద్ తలపై కర్రతో దాడి చేశారు. నిందితుల నుంచి ప్రసాద్ తప్పించుకుని కాలువలో పడిపోయారు. ప్రసాద్‌ను వెంటాడి మరోసారి తలపై కర్రలతో దాడి చేసి, హత్య చేశారు. మృతదేహాన్ని రహదారిపై పడేసి, రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు నిందితులు ప్రయత్నించారు. నిందితులిద్దరినీ పోలీసులు అరెస్టు చేశారు.

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌ను తరలించొద్దు

- కర్నూలు ఎపిజిబి రీజనల్ కార్యాలయం వద్ద ధర్నా



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న అంజిబాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఎపిజిబి) ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కర్నూలులో ధర్నా చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో నగరంలోని భాగ్యనగర్ ఎపిజిబి రీజనల్ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం చేపట్టారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని తరలించొద్దని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు మాట్లాడుతూ.. బ్యాంకు ప్రధాన కార్యాలయం అమరావతికి మార్చాలని ప్రయత్నం చేస్తున్నారని, ఇది సరైనది కాదన్నారు. బ్యాంకులు విలీనమైన సందర్భంలో ఏది పెద్ద బ్యాంకు ఉంటే ఆ బ్యాంకు కార్యాలయాన్ని ప్రధాన కార్యాలయంగా కొనసాగించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు హనుమంతరెడ్డి మాట్లాడుతూ.. ఆర్‌బిఐ ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం బ్యాంకులు విలీనమైన సందర్భంలో ఏది పెద్ద బ్యాంకు అయితే ఆ బ్యాంకు ప్రధాన కార్యాలయమే కొత్తగా ఏర్పడిన బ్యాంకు కార్యాలయంగా ఏర్పడాలని ఉందని, రెండవ గైడ్‌లైన్స్ ప్రకారం రాష్ట్ర రాజధానిలో పెట్టుకోవచ్చని ఉందని, మూడవ గైడ్‌లైన్స్ ప్రకారం సొంతభవనం ఏ బ్యాంకుకు ఉంటే ఆ బ్యాంకునే ప్రధాన కార్యాలయంగా కొనసాగించాలని ఉందన్నారు. మొదటిది, మూడో గైడ్‌లైన్స్ ప్రకారం ఎపిజిబి ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగే అర్హత ఉందన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ మాట్లాడుతూ.. బ్యాంకు ప్రధాన కార్యాలయం వేరే ప్రాంతానికి వెళ్తే నష్టపోయేది రాయలసీమ వాసులేనని తెలిపారు. సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు రమణారెడ్డి, సిఐటియు న్యూ సిటీ కార్యదర్శి సాయిబాబా, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, న్యూసిటీ కార్యదర్శి ఓల్డ్ సిటీ కార్యదర్శి మెహమూద్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సుధాకరప్ప తదితరులు పాల్గొన్నారు.



నూతన వధూవరులతో మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి కుమారుడి వివాహానికి హాజరైన జగన్

ప్రజాశక్తి-కడప అర్బన్ (వైఎస్ఆర్ జిల్లా)

పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవి.రామచంద్రారెడ్డి కుమారుడు ఎంవి.సాయి సుధీర్ కుమార్ రెడ్డి, లక్ష్మీ మౌనిక రెడ్డి వివాహం వైభవంగా జరిగింది. శుక్రవారం కడప నగరంలోని రామాంజనేయపురంలో ఉన్న మేడా రఘునాథరెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో వివాహ మహోత్సవం నిర్వహించారు. వైసిపి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ ఎంవి.శ్రీదేవి జగన్మోహన్‌రెడ్డికి స్వాగతం పలికారు. వివాహ మహోత్సవానికి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.

'రెడ్‌బుక్'తో అధికార దుర్వినియోగం

- మాజీ సిఎం వైఎస్ జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో చట్టానికి, న్యాయానికి చోటులేకుండా పోయిందని, తీవ్ర అధికార దుర్వినియోగంతో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. దీనిపై శుక్రవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. రాజ్యాంగానికి పాలకులు తూట్లు పొడుస్తున్నారని, వంశీ విషయంలో కూటమి సర్కారు తీరు అన్యాయంగా ఉందని తెలిపారు. ఈ కేసులో తనతో టిడిపి నాయకులు బలవంతంగా కేసు పెట్టించారని జడ్జి ముందు దళిత యువకుడు వాంగ్మూలం ఇస్తే దాన్ని తట్టుకోలేక దుర్మార్గాలకు దిగుతున్నారని పేర్కొన్నారు. నిజాన్ని చెప్పినందుకు పోలీసులను పంపించి మరీ వేధిస్తున్నారని, కక్షలు తీర్చుకోవడానికి ప్రభుత్వ వ్యవస్థలను ఇన్ని రకాలుగా దుర్వినియోగం చేస్తారా? అని ఆయన ప్రశ్నించారు. సుప్రీంకోర్టు దృష్టిలో ఉన్న కేసు విచారణలో ఉండగానే వంశీని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. దెందులూరులో మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిపై కేసు పెట్టడాన్ని ఖండించారు. అబ్బయ్యచౌదరి కారు డ్రైవర్‌ను స్థానిక ఎమ్మెల్యే బెదిరించి బూతులు తిట్టి పైగా వారిపైనే కేసులు పెట్టించారని పేర్కొన్నారు. తప్పుడు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరిన వారిపైనే హత్యాయత్నం కేసులు పెడుతున్నారని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్‌తోపాటు 143 హామీలు నిలబెట్టుకోలేక, ఒక్కదాన్నీ అమలు చేయక ప్రజల దృష్టిని మళ్లించేందుకు వైసిపి నాయకులను, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ తప్పులను ప్రజలు వారి డైరీల్లో రాసుకుంటున్నారని, తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

కర్నూలు ఎన్‌ఆర్‌పేటలో బర్డ్ ఫ్లూ

- కిలోమీటర్ పరిధి రెడ్‌జోన్‌గా ప్రకటన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు ఎన్‌ఆర్‌పేటలో బర్డ్‌ఫ్లూ వచ్చినట్లు గుర్తించామని నగరపాలక సంస్థ ప్రజా ఆరోగ్యాధికారి డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి చెప్పారు. ఎన్‌ఆర్‌పేటలో ఒక కిలోమీటరు పరిధిని రెడ్‌జోన్‌గా ప్రకటించామని తెలిపారు. సంకల్‌బాగ్, ఎన్‌ఆర్ పేట, ప్రకాష్ నగర్ ప్రాంతాలలో పది కిలోమీటర్ల పరిధిలో కోడి మాంసం, గుడ్లు అమ్మకాలను నిషేధించినట్లు చెప్పారు. పశు వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఒక కోడికి మాత్రమే పాజిటివ్ వచ్చినట్లు గుర్తించామన్నారు. ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకూ గురికావాల్సిన అవసరం లేదన్నారు. బర్డ్ ఫ్లూ వ్యాధిపై ప్రజలు ఆందోళన చెందొద్దని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ అన్నారు. వ్యాధిని నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్‌ను ఫోన్‌లో ఆరా తీశారు.

రిలయన్స్, డిస్నీ ఒటిటిల విలీనం

- ఇక 'జియో హాట్‌స్టార్'గా ప్రయాణం

న్యూఢిల్లీ : రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన వయాకామ్ 18, స్టార్ ఇండియా విలీనంలో భాగంగా కొత్త ఒటిటి 'జియోస్టార్'ను ఆవిష్కరించాయి. ఈ ఒటిటి వేదికలో జియో సినిమా, డిస్నీ, హాట్‌స్టార్‌ను కూడా ఒకే వేదిక పైకి తీసుకొచ్చాయి. రూ.149 నుంచే సబ్‌స్క్రిప్షన్ ప్లాన్స్ అందుబాటులో ఉంటాయని శుక్రవారం ఇరు సంస్థలు ఓ ప్రకటనలో తెలిపాయి. మూడు లక్షల గంటల ఎంటర్‌టైన్‌మెంట్, లైవ్ స్పోర్ట్స్ కవరేజీ, 50కోట్ల మందికి పైగా యూజర్లతో ఇకనుంచి 'జియోహాట్‌స్టార్' మరింత కొత్తగా ప్రేక్షకులను అలరించనుందని పేర్కొన్నాయి. ప్రస్తుతం ఉన్న జియో సినిమా, డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ చందాదారులు సజావుగా కొత్త సేవలను కొనసాగించుకోవచ్చని పేర్కొన్నాయి.

టాటా గ్రూపు ఛైర్మన్ చంద్రశేఖరన్‌కు నైట్‌హుడ్ పురస్కారం



న్యూఢిల్లీ : టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్‌కు అరుదైన గౌరవం దక్కింది. బ్రిటన్, భారత్ మధ్య వ్యాపార సంబంధాలకు ఆయన చేసిన సేవలకు బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు ప్రతిష్టాత్మక నైట్‌హుడ్ పురస్కారాన్ని ప్రకటించింది. 'మోస్ట్ ఎక్సలెంట్ ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్' అవార్డును ప్రదానం చేయనున్నట్లు ఈ మేరకు బ్రిటిష్ ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఇంత ప్రతిష్టాత్మక గుర్తింపు లభించడంపై చంద్రశేఖరన్ హర్షం వ్యక్తం చేశారు. బ్రిటన్ రాజు చార్లెస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. టెక్నాలజీ, ఆతిథ్యం, ఉక్కు, రసాయనాలు, ఆటోమోటివ్ రంగాల్లో బ్రిటన్‌తో బలమైన వ్యూహాత్మక సంబంధాలను కొనసాగిస్తున్నందుకు ఎంతో సంతోషిస్తున్నామన్నారు.

న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్‌పై ఆర్‌బిఐ కొరడా

న్యూఢిల్లీ: మహారాష్ట్రలోని న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్‌పై రిజర్వ్ బ్యాంక్ కొరడా ఝులిపించింది. ఆరు నెలల పాటు కొత్త రుణాలు మంజూరు చేయకుండా, నూతన డిపాజిట్లను స్వీకరించకుండా ఆంక్షలు విధించింది. అదే విధంగా నగదు ఉపసంహరణకు వీలు లేకుండా నిరోధించింది. బ్యాంకు ఆర్థిక పరిస్థితి, ద్రవ్య స్థితి గురించి ఆందోళనల కారణంగా ఆంక్షలు విధించినట్లు ఆర్‌బిఐ తెలిపింది. ఇటీవల ఆ బ్యాంక్ తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటుంది. ఆర్‌బిఐ అనుమతి లేకుండా రుణాల మంజూరు, కొత్త పెట్టుబడులు పెట్టడం, కొత్త డిపాజిట్లను అంగీకరించడం, అప్పుల కోసం చెల్లింపులు చేయడం, ఆస్తులను విక్రయించడం, బదిలీ చేయడం వంటివి చేయకూడదని న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్‌ను ఆదేశించింది. దీంతో డిపాజిట్‌దారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సంపాదకీయం

బుల్డోజర్ పాలన


ఉత్తరాదిన కొందరు నిందితుల ఇళ్లు, వ్యాపార సంస్థలను బుల్డోజర్లతో నేలమట్టం చేయడంలాంటి ఆటవిక చర్యలు పెరిగిపోయిన నేపథ్యంలో సుప్రీం కోర్టు తలంటిన తరువాత ఆయా రాష్ట్రాల్లోని పరివార్ పాలకులు వెనక్కు తగ్గారుకానీ ఇప్పుడు ఢిల్లీ పాదుషాలు పార్లమెంటులో బిల్లుల బుల్డోజింగ్‌కు తెగబడడం దారుణం. గురువారంనాడు పార్లమెంటు ఉభయ సభల్లో వక్ఫ్ బిల్లు సవరణలు, జెపిసి నివేదిక విషయంలో అధికార పార్టీ వ్యవహరించిన తీరు పార్లమెంటరీ సాంప్రదాయాలను మంటగలపడమే! కేంద్ర సర్కారు రూపొందించిన వక్ఫ్ బిల్లు అత్యంత వివక్షాపూరితమైనది. దానిపై పార్లమెంటు లోపల, వెలుపల నిరసనలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. ఆ ధాటిని తట్టుకోలేని పరిస్థితుల్లో ఆ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి పంపారు. జెపిసి ఎలా వుండరాదో ఒక ఉదాహరణగా పేర్కొనదగిన రీతిలో ఆ ఛైర్మన్ దాన్ని నిర్వహించారు. సంబంధిత సంస్థలు, వ్యక్తులు తమ అభిప్రాయాలను జెపిసి కి వివరించే అవకాశం కల్పించలేదు సరికదా అందులో సభ్యులుగా వున్న ఎంపీలను కూడా మాట్లాడనివ్వని పరిస్థితి నెలకొంది. దాంతో హైదరాబాద్‌తో సహా పలుచోట్ల జెపిసి సభ్యులు బైఠాయింపులు, ఆందోళనలు చేశారు కూడా. తమ అభిప్రాయాలను ఛైర్మన్ పరిగణనలోకి తీసుకోవడంలేదని లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం దక్కలేదు. ఇంతా జరిగాక జెపిసి సభ్యులు తమ అసమ్మతి నివేదికలు కమిటీకి సమర్పించారు. జెపిసి ఛైర్మన్‌కు, ఆయన్ను నడిపించిన పెద్దలకూ ఏమాత్రం ఇంగితం వున్నా అసమ్మతి నోట్‌లను జెపిసి నివేదికలో చేర్చి పార్లమెంటు ముందుంచేవారు. కానీ అది కూడా చేయకపోవడంతో పార్లమెంటులో ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేయక తప్పలేదు. వాటిని చేర్చుతామంటూనే ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే వక్ఫ్ సవరణ బిల్లుపై నివేదికకు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం లభించడం విచారకరం.

ఇప్పుడు వక్ఫ్ ఆస్తులను లాక్కుంటున్నారని, ఆ తరువాత గురుద్వారాలు, చర్చిలు, ఆలయాల ఆస్తులను లాక్కుని తమ మిత్రులకు కట్టబెడతారన్న ప్రతిపక్షాల విమర్శ సత్యదూరం కాదు. ఈ నివేదికకు వ్యతిరేకంగా ఇండియా బ్లాక్‌లోని ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా ఉండడం ఆహ్వానించదగినది. వక్ఫ్ బిల్లు సవరణలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఒక మతానికి చెందినవారిపైన, వారి ఉమ్మడి ఆస్తులపైన వివక్షాపూరిత దాడి చేసింది. ఆ సవరణల్లోని అంశాలు వక్ఫ్ మూల బిల్లుకు వ్యతిరేకమైనవేగాక భారత రాజ్యాంగ లౌకిక స్ఫూర్తికి విఘాతం కల్పించేవే. ఇప్పుడు ఒక మతం విషయంలో మొదలైన దాడి ఆ తరువాత ఒక్కొక్కటిగా మైనార్టీ మతాలన్నిటిపై సాగుతుందన్న సంగతి అందరికీ తెలిసిందే! చివరికి మెజార్టీ మతానికి చెందినవారిలోనూ అధికార పక్షానికీ లేదా అధినేతలకూ గిట్టని వారిని సైతం వదిలిపెట్టరు. ఇటువంటి నిరంకుశ పోకడలు అక్కడికే దారి తీస్తాయని ప్రపంచ చరిత్ర చెబుతోంది. ఒకే దేశం-ఒకే భాష, ఒకే దేశం-ఒకే కార్డు, ఒకే దేశం-ఒకే యూనిఫాం వంటి నినాదాలతో మొదలైనదల్లా అలా అలా ఒకే దేశం-ఒకే పార్టీ, ఒకే దేశం-ఒకే మతం అనే స్థితికి చేరుకుంటుంది. ఆ తరువాత ఒకే దేశం-ఒకే నాయకుడు, అదే అధ్యక్ష తరహా పాలన...ఇదీ జరగబోయే పరిణామ క్రమం అంటూ పలువురు దేశ భక్తులు చేస్తున్న హెచ్చరికలు అందరి గమనంలోనూ ఉండాలి. భిన్నత్వంలో ఏకత్వం భారతీయ విధానం. వలస పాలనకు వ్యతిరేకంగా రెండు వందల ఏళ్లు సాగిన జాతీయోద్యమంలో ఆ ఐక్యత వెల్లివిరిసింది. అంతటి గరిష్ట ఐక్యతవల్లనే రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని అంతరింపజేయడం సాధ్యమైంది. అన్ని మతాలు, కులాలు, తెగలు, ప్రాంతాలవారందరూ ఒక్కతాటిపై నిలిచి సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడానికి, ఈ దేశాన్ని పాలించడానికి రాజ్యాంగం ఏర్పాటైంది. ఇప్పుడు ఆ రాజ్యాంగ మౌలిక స్వరూపానికి తూట్లు పొడిచేలా కొత్త కొత్త చట్టాలు, ఉన్నవాటికి సవరణలు, సరికొత్త కోడ్ లను పరివార్ పాలకులు తీసుకొస్తున్నారు. ప్రజలంతా అప్రమత్తమై అటువంటి బిల్లులను, చట్టాలను ప్రతిఘటించాలి. దేశ స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం, లౌకిక తత్వం, సామాజిక న్యాయం, ఫెడరలిజం లను కాపాడుకోవాలి.

మహనీయుల మాట



ఏదీ దానంతట అది
మన దగ్గరకు రాదు.
శోధించి సాధించాల్సిందే.
- శ్రీశ్రీ



ఢిల్లీ శాసన సభ ఎన్నికల ఫలితాలు

వ్యాఖ్య



> అవినీతికి వ్యతిరేకంగా భారతదేశం అనే ఉద్యమం నుంచి ఆవిర్భవించిన ఆప్ ఇప్పుడు అవినీతి ఆరోపణలలో చిక్కి తన ప్రతిష్ట తనే మసకబార్చుకున్నదనీ, దాని నాయకుడైన అరవింద్ కేజ్రీవాల్ కళంకితుడైనాడని చెప్పడం జరుగుతున్నది. పూర్తి కాలం పాలించిన ఆప్ తొలి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం చేసిన వివిధ వాగ్దానాలను నిలబెట్టుకోగలిగింది. ఇంటికి 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, ఉచిత నీటి సరఫరా, మొహల్లా ఆస్పత్రులు, ప్రభుత్వ పాఠశాలల స్థాయి పెంచడం వంటి పనులు చేసిందనేది సాధారణంగా వినిపిస్తున్న మరో మాట. అయితే రెండోసారి అధికారంలోకి వచ్చాక ఆప్ ప్రభుత్వం, మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించడం తప్ప మరేమీ పని చేయలేక విఫలమైంది. లెఫ్టినెంట్ గవర్నర్‌కూ ఆప్ సర్కారుకు మధ్యన తగాదా కూడా ఓటమికి ఒక కారణంగా చూపడం జరుగుతున్నది.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ఢిల్లీ శాసన సభ ఎన్నికలలో బిజెపి 45.6 శాతం ఓట్లతో 48 సీట్లు తెచ్చుకుంది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) 43.6 శాతం ఓట్లతో 22 సీట్లు తెచ్చుకుంది. రెండు పార్టీల మధ్య ఓట్ల శాతం తేడా కేవలం రెండు శాతమే అయినప్పటికీ బిజెపికి 40 సీట్లు అదనంగా తెచ్చిపెట్టింది.

ఢిల్లీ శాసన సభ ఎన్నికల ఫలితాలను వేర్వేరు దృక్కోణాలతో వీక్షించి విశ్లేషించడం జరుగుతున్నది. 27 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత బిజెపి ఢిల్లీ ఎన్నికలు గెలవడం ఆ పార్టీకి, మోడీ ప్రభుత్వానికి పెద్ద ఊపు నిచ్చిందనడంలో సందేహం లేదు. అదే సమయంలో పది సంవత్సరాలు అధికారం సాగించిన ఆప్ ఓడిపోవడంపై కూడా ఒక ప్రత్యేక తరహాలో భాష్యాలు వినిపిస్తున్నాయి. కార్పొరేట్ మీడియా, అలాగే రాజ్యానికి అనుకూలమైన వ్యాఖ్యాతలు ఆప్ చేసిన తప్పొప్పుల కారణంగానే ఓటర్లు శిక్షించారనే భావాన్ని ముందుకు తెస్తున్నారు.

కారణమేంటి?

అవినీతికి వ్యతిరేకంగా భారతదేశం అనే ఉద్యమం నుంచి ఆవిర్భవించిన ఆప్ ఇప్పుడు అవినీతి ఆరోపణలలో చిక్కి తన ప్రతిష్ట తనే మసకబార్చుకున్నదనీ, దాని నాయకుడైన అరవింద్ కేజ్రీవాల్ కళంకితుడైనాడని చెప్పడం జరుగుతున్నది. పూర్తి కాలం పాలించిన ఆప్ తొలి ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం చేసిన వివిధ వాగ్దానాలను నిలబెట్టుకోగలిగింది. ఇంటికి 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, ఉచిత నీటి సరఫరా, మొహల్లా ఆస్పత్రులు, ప్రభుత్వ పాఠశాలల స్థాయి పెంచడం వంటి పనులు చేసిందనేది సాధారణంగా వినిపిస్తున్న మరో మాట. అయితే రెండోసారి అధికారంలోకి వచ్చాక ఆప్ ప్రభుత్వం, మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించడం తప్ప మరేమీ పని చేయలేక విఫలమైంది. లెఫ్టినెంట్ గవర్నర్‌కూ ఆప్ సర్కారుకు మధ్యన తగాదా కూడా ఓటమికి ఒక కారణంగా చూపడం జరుగుతున్నది. అయితే బాధ్యత రెండు పార్టీలపై పెట్టడమే ధోరణిగా వుంది.

ఈ విధంగా ప్రభుత్వ వ్యతిరేకత ఉధృతమవడమే ఎన్నికల్లో ఆప్ ఎదురుదెబ్బ తినడానికి కారణమైందనే నిర్ధారణ చేయబడుతున్నది. మోడీ గ్యారంటీలు, డబుల్ ఇంజన్ సర్కార్ అనేవి ప్రజల తీర్పు పొందగలిగాయని తేల్చడం జరుగుతున్నది.

మలి ప్రభుత్వ పనితీరు

రెండోసారి వచ్చాక ఆప్ ప్రభుత్వం (2020-25) కొన్ని కీలక వాగ్దానాలను అమలు చేయలేకపోయిన మాట నిజమే. మౌలిక సదుపాయాలైన రోడ్లు, మురుగునీటి పారుదల, చెత్త నిర్మూలన, నీటి సరఫరా వంటివి క్షీణించిపోవడంతో ప్రత్యేకించి మధ్య తరగతి వర్గాలలో అసంతృప్తి నెలకొన్నది. ఒక సిద్ధాంతపరమైన వైఖరి లేకపోవడం ఆప్ అధికార ముద్రగా మారింది. చివరకు అది ఆ లోపానికే బలైంది. బిజెపి-ఆరెస్సెస్‌ల హిందూత్వ దుందుడుకు విధానాల ప్రభావాన్ని లేకుండా చేయడం కోసం నిరంతరం హిందూ మత ప్రతీకలకూ, మనోభావాలనూ సంతృప్తి పర్చే ప్రయత్నమే జరిగింది. దాడులకు గురవుతున్న ముస్లిం మైనారిటీలకు మద్దతుగా ఒక నికరమైన వైఖరి తీసుకుని నిలబడకుండా ఆప్ ఎప్పటికప్పుడు దూరంగా వుండిపోయింది. ఆప్ ప్రభుత్వం అంతకంతకూ అందుబాటులో లేకుండా పోయింది. కార్మికులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో సహా వివిధ తరగతుల ప్రజల సమస్యలను పెడచెవిన పెట్టింది.

> ఈ మొత్తం కాలమంతటా కూడా ఉన్నతాధికారులు మంత్రుల మాట వినకపోవడమే గాక ఆ మంత్రుల ఆదేశాలకు వ్యతిరేకంగా పనిచేయడం కానవచ్చింది. లెఫ్టినెంట్ గవర్నర్, ఉన్నతాధికారులు కుమ్మక్కై మంత్రుల మీద ఆరోపణలు బనాయించారు. వీటన్నిటికీ పరాకాష్టగా ఒక సీనియర్ మంత్రిని అరెస్టు చేయడం, ఉప ముఖ్యమంత్రి, అంతిమంగా స్వయంగా ముఖ్యమంత్రి అందరినీ జైలుకు పంపించారు. కేంద్రం అధికారాలన్నీ హరించడంతో నీటి సరఫరా వంటి అత్యవసర సర్వీసులు అనేకం దెబ్బతిన్నాయి.

ఇక చివరగా ఒక స్వచ్ఛమైన, అవినీతి రహితమైన పార్టీగా ఆప్‌కున్న ప్రతిష్ట దెబ్బతిని పోయింది. మోడీ ప్రభుత్వం బనాయించిన తప్పుడు కేసుల కంటే ముఖ్యమంత్రి నివాసం భారీ ఖర్చుతో మరమ్మతులు చేసి పునరుద్ధరించడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడింది. బిజెపి సాగించిన శేష్‌మహల్ ప్రచారం ఓటర్లలో ఒక భాగంపై ప్రభావం చూపించింది.

మోడీ సర్కారు దాడి

ఈ విషయాలన్నీ నిజమని ఒప్పుకున్నప్పటికీ ఎన్నికల ఫలితానికి ప్రధాన కారణం మాత్రం ఆప్ ప్రభుత్వంపైనా దాని నాయకత్వంపైన మోడీ ప్రభుత్వం, బిజెపి అదేపనిగా సాగించిన దాడి అనే నిజాన్ని మాత్రం తగ్గించి చూపడం, పట్టించుకోకపోవడం జరుగుతున్నది. జాతీయ రాజధాని ప్రాంతం ఢిల్లీలో జరిగింది స్వతంత్ర భారతంలో ఎన్నడూ ఎరగనిది.

రాజ్యాంగ విరుద్ధమైన పద్ధతులతో కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని దాదాపు హస్తగతం చేసుకున్నది. 1991 చట్టం ప్రకారమైతే ఢిల్లీ ప్రభుత్వం పరిమితమైన అధికారాలు కలిగివుంది. పోలీసులు, శాంతి భద్రతలు, భూమి నిర్వహణ వంటివి లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలో పెట్టబడ్డాయి. అయితే 2020 ఎన్నికల్లో ఆప్‌ను ఓడించలేక పోయిన మోడీ ప్రభుత్వం ఢిల్లీ ప్రభుత్వం చేతి నుంచి పాలనా సర్వీసులను కూడా లాగేసుకోవడం కోసం మోసపూరతమైన పన్నాగాలకు పాల్పడింది.

అధికారుల నియామకం, బదిలీలను లెఫ్టినెంట్ గవర్నర్ తన చేతిలోకి తీసుకున్నారు. ఉన్నతాధికారులు మంత్రుల మాట వినడం మానేసి లెఫ్టినెంట్ గవర్నర్ ఆదేశాల కోసం చూడటం ప్రారంభించారు. ఈ ఉత్తర్వుకు వ్యతిరేకంగా ఢిల్లీ ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లింది. 2023 మే లో ఇచ్చిన తీర్పులో సుప్రీం కోర్టు లెఫ్టినెంట్ గవర్నర్ అధికారాలను తోసిరాజన్నది. ప్రజా భద్రత, పోలీసు, భూమి వ్యవహారాలు తప్ప మిగిలిన అన్ని ప్రభుత్వ సర్వీసుల్లోనూ ఢిల్లీ ప్రభుత్వానికే అదుపు వుంటుందని చెప్పింది. కేంద్ర హోం మంత్రి ఈ తీర్పును ఆమోదించలేకపోయారు. లెఫ్టినెంట్ గవర్నర్ పరిధిలోనికే సర్వీసులను చేరుస్తూ ఆర్డినెన్సు తీసుకొచ్చారు. ఉత్తరోత్తరా దీన్నే ఢిల్లీ ఎన్‌సిటి ప్రభుత్వ చట్టానికి సవరణల రూపంలో పొందుపర్చారు.

ఈ మొత్తం కాలమంతటా కూడా ఉన్నతాధికారులు మంత్రుల మాట వినకపోవడమే గాక ఆ మంత్రుల ఆదేశాలకు వ్యతిరేకంగా పనిచేయడం కానవచ్చింది. లెఫ్టినెంట్ గవర్నర్, ఉన్నతాధికారులు కుమ్మక్కై మంత్రుల మీద ఆరోపణలు బనాయించారు. వీటన్నిటికీ పరాకాష్టగా ఒక సీనియర్ మంత్రిని అరెస్టు చేయడం, ఉప ముఖ్యమంత్రి, అంతిమంగా స్వయంగా ముఖ్యమంత్రి అందరినీ జైలుకు పంపించారు. కేంద్రం అధికారాలన్నీ హరించడంతో నీటి సరఫరా వంటి అత్యవసర సర్వీసులు అనేకం దెబ్బతిన్నాయి. ఉదాహరణకు ఢిల్లీ అసెంబ్లీ 2024 బడ్జెట్‌లో ఢిల్లీ జల్ బోర్డుకు 3000 కోట్లు కేటాయించింది. శాసనసభ చట్టం ద్వారా కేటాయించిన బడ్జెట్ మొత్తం ఇది. అయినా ఆర్థిక శాఖ కార్యదర్శి జల్ బోర్డుకు నిధులు బదలాయింపు కాకుండా అడ్డుపడ్డారు. ఈ విషయంలో ఉపశమనం కోసం ఢిల్లీ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించవలసి వచ్చింది.

కనుక కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రతిష్టంభనలో పడేయడం, సీనియర్ ఉన్నతాధికారుల సాచివేత చర్యలు ఆప్ ప్రభుత్వానికి నష్టదాయకంగా పరిణమించాయి. మోడీ ప్రభుత్వం తను చేసిన ఈ నేరం వల్లనే లబ్ధి పొందగలిగితే ఆప్ ప్రభుత్వం తన అసమర్థ నిర్వహణకు మూల్యం చెల్లించింది.

ఫలితాల పాఠాలు

ఢిల్లీ ఎన్నికల సమరంలో వచ్చిన ఈ ఫలితం బిజెపిని ఓడించేందుకు అన్ని లౌకిక పార్టీలూ ఒక తాటి పైకి రావాలనే పిలుపుకు దారితీసి వుండాల్సిందని ఎవరైనా ఆశిస్తారు. ప్రజాస్వామ్యంపైన, సమాఖ్యతత్వంపైన బిజెపి చేస్తున్న దుర్మార్గమైన దాడులను వెనక్కు కొట్టడానికి అదే మార్గమని భావిస్తారు. అయితే ఇదే జరగలేదు.ఆప్ కూడా ప్రజల్లో ఈ ప్రచారాన్ని బలంగా తీసుకుపోలేదు.

ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అనుసరించిన వైఖరిని 'ఇండియా' వేదిక లోని ఇతర పార్టీలు విమర్శించడం సరైన పనే. కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం మొత్తం ఆప్‌ను ఓడించడంపైనా, దాని నాయకుడైన కేజ్రీవాల్‌ను అవినీతిపరుడుగా ముద్ర వేయడంపైనా కేంద్రీకరించింది. ఈ తరహా ప్రచారానికి రాహుల్ గాంధీయే శ్రీకారం చుట్టారు. అంతేగాక గత ఎన్నికల్లో 4.26 శాతం ఓట్లు తెచ్చుకున్న కాంగ్రెస్ పార్టీ ఆప్‌తో ఎలాంటి అవగాహన సాధ్యం కాని పరిస్థితుల్లో అసెంబ్లీలోని మొత్తం 70 సీట్లకు పోటీ పెట్టి వుండాల్సింది కాదు. ఆప్ నుంచి పెద్ద భాగం ఓటర్లు దూరం కావడం ఒక ప్రధాన కారణమైతే అప్ ఓడిపోయిన 13 సీట్లలో దానికి, కాంగ్రెస్‌కు కలిపి ఓటమి తేడా కన్నా ఎక్కువగా ఓట్లు పొందాయి. ఆప్ నాయకులైన కేజ్రీవాల్, మనీశ్ శిశోడియా, సురభి భట్టాచార్య అందరూ ఓడిపోగా వారి ఓట్ల తేడా కన్నా కాంగ్రెస్‌కు వచ్చిన ఓట్ల సంఖ్య ఎక్కువగా వుంది.

లౌకిక, ప్రజాస్వామిక ప్రతిపక్షాలకు ఈ ఓటమి కొంత నిరుత్సాహకరమైనదే అయినా ఆప్‌కు 44 శాతం మంది ఓటు చేయడమనే యథార్థం చెరిగిపోదు. వారిలో అత్యధికులు పేద వర్గాలు, మహిళలు కావడం విశేషం.


(ఫిబ్రవరి 12 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

కేంద్ర బడ్జెట్-అప్పులు-ప్రజలపై భారాలు

విశ్లేషణ



డా|| బి. గంగారావు



> మొత్తంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం బడ్జెట్ ద్వారా అన్ని రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులను చొప్పించడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నది. అప్పుల రూపంలో నిధుల విధానాన్ని ముందుకు తీసుకొచ్చింది. రాష్ట్రాలను కూడా బలవంతంగా ఈ విధానంలోకి దించుతున్నది. ప్రజలపై పెను భారాలు మోపటమే కాక మొత్తం ప్రభుత్వ ఆస్తులను, ప్రజల మౌలిక సదుపాయాలను, సేవలను, వనరులను ప్రైవేటు శక్తుల పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటున్నది.

కేంద్ర బిజెపి సర్కార్ ప్రవేశ పెట్టిన 2025-26 బడ్జెట్ తీవ్ర ప్రమాదకర నిర్ణయాలకు తెర లేపింది. గతంలో అమలు చేస్తున్న సంస్కరణలను మరింత వేగంగా అమలు చేసేందుకు ఈ బడ్జెట్ ప్రయత్నిస్తున్నది. ముఖ్యంగా బడ్జెట్‌లో అప్పుల నిధులను సమకూర్చి మౌలిక సదుపాయాలను, సామాజిక రంగాలను, పౌర సేవలను ప్రైవేటు శక్తులకు ధారాదత్తం చేయడానికి, ప్రజలపై పెనుభారాలు మోపటానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.

2024-25 బడ్జెట్‌లో ప్రవేశ పెట్టిన పట్టణ ఛాలెంజ్ నిధి పథకాన్ని 2025-26 బడ్జెట్‌లో లక్ష కోట్ల నిధులతో అమలులోకి తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా పట్టణ ప్రాంతాల్లో చేపట్టబోయే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు అవసరమయ్యే మొత్తం వ్యయాన్ని రుణ రూపంలో ఇవ్వరు. ప్రాజెక్టు వ్యయంలో కేవలం 25 శాతం మాత్రమే రుణ రూపంలో ఇస్తుంది. 50 శాతం నిధులను తప్పనిసరిగా ప్రైవేట్ భాగస్వామ్యం (పి.పి.పి)తో లేదా బాండ్ల రూపంలో పట్టణ స్థానిక సంస్థలు అప్పులు సేకరించుకొని మౌలిక సదుపాయాలు చేపట్టాల్సి ఉంటుంది. మరో షరతును కూడా విధించారు. ఈ రుణాలతో చేపట్టబోయే మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టుకు ప్రత్యేక వాహక సంస్థను ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో చేపట్టాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టును ప్రత్యేక వాహక సంస్థే నిర్వహిస్తుంది. దీనికయ్యే ఖర్చును ప్రజల నుండి పన్నులు, యూజర్ చార్జీల రూపంలో వసూలు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టులను మున్సిపల్ సంస్థల పరిధి నుండి విడగొడతారు. ఇప్పటివరకు పట్టణ సంస్కరణకు ముడిపెట్టి కొన్ని పథకాలను రూపొందించి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తున్నది.

ఇప్పుడు మొత్తం మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు రుణాల ద్వారా, ప్రైవేట్ సంస్థ ద్వారా మాత్రమే చేపట్టాల్సి వుంటుంది. ఈ పథకం వల్ల రాబోయే కాలంలో మున్సిపల్ సేవలు పెద్ద ఎత్తున ప్రైవేటీకరించబడతాయి. ముఖ్యంగా మంచినీరు, పారిశుధ్యం ప్రైవేట్ నిర్వహణలోకి బదిలీ చేయబడతాయి.

పేదలు, దిగువ తరగతి ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేసే గృహ కల్ప ప్రాజెక్టులలోకి కూడా ఈ రుణ విధానాన్ని అమలులోకి తీసుకొస్తున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ గృహ కల్పనలో లబ్ధిదారుడు ఎక్కువ వాటా భరించాల్సి వస్తుంది. అంతేకాక ఈ నిర్మాణాల్లో ప్రభుత్వ పాత్ర తగ్గిపోయి ప్రైవేట్ సంస్థల ఆధిపత్యం పెరుగుతుంది. పట్టణ భూవిధానం, పట్టణ ప్రణాళికా విధానంలో కూడా భారీ మార్పులు, సంస్కరణలు తీసుకురానున్నారు. వీటిల్లో కూడా ప్రైవేట్ పెట్టుబడుల ప్రమేయం పెంచనున్నారు. మోనటైజేషన్ పేర పట్టణ ఆస్తులు మొత్తం ప్రైవేట్‌పరం చేయాలనేది పట్టణ ఛాలెంజ్ నిధి ముఖ్యమైన లక్ష్యం.

పథకం ప్రకారం ఉన్నత విద్యకు నిధులు కోత పెడుతూ రెండో వైపు కేంద్ర బడ్జెట్‌లో రుణాల రూపంలో నిధులు తీసుకోవాలని కేంద్ర బిజెపి ప్రయత్నిస్తున్నది. రుణాల ముసుగులో ఉన్నత విద్యా సంస్థల్లో ప్రైవేటీకరణ విధానాల అమలుకు పూనుకుంటున్నది. విద్యా సంస్థలకు అయ్యే ఖర్చును క్రమేణా ఫీజుల రూపంలో విద్యార్థుల నుండి వసూలు చేసే చర్యలకు పాల్పడుతున్నది. అందుకు ఉన్నత విద్యా ఫైనాన్సింగ్ ఏజెన్సీ (హెచ్.ఇ.ఎఫ్.ఏ) అనే సంస్థను ఏర్పాటు చేసింది.

ఈ సంస్థకు కేంద్ర బడ్జెట్ నుండి నిధులు కేటాయిస్తారు. 2025-26 బడ్జెట్‌లో రూ.20 వేల కోట్ల నిధులు కేటాయించారు. ఈ నిధులు గ్రాంట్లు కాదు. ఉన్నత విద్య రంగంలో ఐ.ఐ.టి, ఎన్.ఐ.టి, ఐ.ఐ.ఎం, ఎయిమ్స్, సెంట్రల్ యూనివర్సిటీల వంటి కేంద్ర విద్యా సంస్థల మౌలిక సదుపాయాల కల్పన, పరిశోధనల అభివృద్ధి పేర ఈ నిధులను అప్పుల రూపంలో హెచ్.ఇ.ఎఫ్.ఏ ద్వారా ఇస్తుంది. ఆ రుణాలను వడ్డీతో కలిపి పదేళ్ళలో తిరిగి ఆ విద్యా సంస్థలు కేంద్ర ప్రభుత్వానికి చెల్లించాలి.

ఇప్పుడు తాత్కాలికంగా రుణాలు తీసుకున్న విద్యా సంస్థలకు కొంత కాలం వడ్డీని కేంద్ర బడ్జెట్ నుండి నిధుల రూపంలో ఇచ్చి తిరిగి రాబట్టుకుంటున్నది.

ప్రభుత్వం ఈ పథకం ద్వారా ఉన్నత విద్యా సంస్థల్లో వివిధ మౌలిక సదుపాయాల విస్తరణ, కొత్తవి ఏర్పాటు, భవనాల నిర్మాణం, పరిశోధనల అభివృద్ధికి అవసరమైన శాస్త్ర సాంకేతిక పరికరాలకు అయ్యే మొత్తం ప్రాజెక్టు వ్యయానికి సరిపడా నిధులు ఇవ్వదు. కేవలం ప్రాజెక్టు వ్యయంలో 50 శాతం మాత్రమే అప్పు రూపంలో ఇస్తుంది. మిగిలిన నిధులను బాండ్ల రూపంలో ప్రైవేట్ సంస్థల నుండి లేదా పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యం (పి.పి.పి) ద్వారా సమీకరించుకోవాలి. ఈ రూపంలో ప్రైవేట్ సంస్థలను ఉన్నత విద్యా రంగంలో చొప్పిస్తున్నది. తీసుకున్న అప్పులను ఫీజుల పెంపు ద్వారా విద్యార్థుల నుండి, వాణిజ్య కార్యకలాపాల ద్వారా రాబట్టి చెల్లించాలనే షరతు విధించింది. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇచ్చి తద్వారా ఎక్కువ ఆదాయ వనరులను పొందాలని ఆదేశిస్తున్నది.

ఈ విధానం కేంద్ర ఉన్నత విద్యా సంస్థలకే పరిమితం కాదు. ఇప్పుడు రాష్ట్రాలకు కూడా ఈ విధానాన్ని విస్తరించటానికి పథకం రూపొందించింది. ఫిబ్రవరి ఒకటిన ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ అనంతరం వెంటనే నీతి ఆయోగ్...రాష్ట్రాల పరిధిలో ఉన్నత విద్యా రంగంలో నిధుల కొరత, ప్రమాణాల పెంపుపై 20 రాష్ట్రాల్లో చేసిన అధ్యయన నివేదికను కొన్ని సిఫార్సులతో విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ల మీద గ్రాంట్ల కోసం రాష్ట్ర యూనివర్సిటీలు ఆధార పడకూడదని, ప్రైవేట్ సెక్టార్ భాగస్వామ్యం కల్పించటం, ఫీజులు పెంచుకోవటం ద్వారా ఆదాయాలు పెంచుకోవాలని సూచించింది. ఫీజుల పెంచుకోవటానికి, ఖాళీ స్థలాలు వాణిజ్య కార్యకలాపాలకు వినియోగించుకోవడానికి యూనివర్సిటీలకు రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం ప్రతిపత్తి కల్పించాలని కోరింది. అంతేగాక బాండ్ల రూపంలో యూనివర్సిటీలు రుణాలు సేకరించుకోవటానికి కూడా అవకాశం కల్పించాలని నివేదిక ద్వారా రాష్ట్రాలను ఆదేశించింది.

వాస్తవంగా ఉన్నత విద్యా రంగంలో మొత్తం విద్యార్థుల్లో 80 శాతానికి పైగా రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీలలో చదువుతున్నారు. కేంద్ర విద్యా సంస్థల్లో కేవలం 20 శాతం లోపే వున్నారు. కానీ కేంద్ర బడ్జెట్ నుండి రాష్ట్ర పరిధిలో వున్న ఉన్నత విద్యా రంగానికి మాత్రం నిధులు ఇవ్వకపోగా ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆదేశిస్తున్న ప్రైవేటీకరణ సంస్కరణలు మాత్రం అమలు చేయాలని ఒత్తిడి చేస్తున్నది. అదేవిధంగా కొన్ని విచిత్రమైన వాదనలు కూడా చేస్తున్నది. దేశ స్థూల జాతీయోత్పత్తిలో 6 శాతం విద్యా రంగానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని 5 దశాబ్దాల క్రితమే కొఠారి కమిషన్ చెప్పింది. ఇటీవల మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం-2020 కూడా దీనిని ప్రస్ఫుటంగా పేర్కొన్నది. అయితే నీతి ఆయోగ్ కూడా దీనిని బలపరుస్తూ జిడిపిలో 6 శాతం నిధులు ప్రభుత్వాలు భరించే స్థితిలో లేవు కనుక రుణాలు, ప్రైవేట్ రంగం భాగస్వామ్యం ద్వారా నిధులను సమకూర్చుకోవాలని తెలిపింది. ఇదే వైఖరిని ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఆచరణలో ముందుకు తీసుకొచ్చింది.

రాష్ట్రాల పరిధిలో మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రత్యేకంగా ఈ బడ్జెట్‌లో రూ. లక్షా 50 వేల కోట్లు వడ్డీ లేని రుణ నిధిని 2025-26 బడ్జెట్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నది. 50 ఏళ్ల కాల వ్యవధిలో ఈ వడ్డీ లేని రుణాన్ని తీర్చుకోవటానికి రాష్ట్రాలకు అవకాశం ఇస్తున్నట్లు గొప్పగా కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. ఒకవైపు న్యాయబద్ధంగా పన్ను ఆదాయాల్లో రాష్ట్రాలకు వాటా ఇవ్వకుండా, గ్రాంట్లు, ప్రత్యేక నిధులు కోత పెడుతూ, కేంద్ర ప్రాయోజిత పథకాల్లో రాష్ట్రాల వాటా పెంచి భారాలు వేస్తూ ... ఇప్పుడు తను ప్రవేశ పెట్టిన మౌలిక సదుపాయాల రుణ నిధిని గొప్పగా ప్రచారం చేసుకుంటున్నది. రాష్ట్రాలకు స్నేహపూర్వక సహకారంగా వర్ణించుకుంటున్నది. ఈ విధానం చాలా ప్రమాదకరమైనది.

ఈ రుణాలకు కూడా షరతులు విధిస్తున్నది. కొన్ని సంస్కరణలు కూడా అమలు చేయాలని ముడి పెడుతున్నది. ఈ రుణాలతో రాష్ట్రాలు తమ పరిధిలోని విద్య, వైద్యం, వ్యవసాయ నీటి ప్రాజెక్టులు, విద్యుత్, రహదారులు, విమానాశ్రయాలు, మెట్రో రైల్ తదితర మౌలిక సదుపాయాలు ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో చేపట్టాల్సి ఉంటుంది. దీనికయ్యే ఖర్చును వివిధ పన్ను రూపాల్లో ప్రజల నుండి తిరిగి వసూలు చేయాల్సి ఉంటుంది.

మొత్తంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం బడ్జెట్ ద్వారా అన్ని రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులను చొప్పించడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నది. అప్పుల రూపంలో నిధుల విధానాన్ని ముందుకు తీసుకొచ్చింది. రాష్ట్రాలను కూడా బలవంతంగా ఈ విధానంలోకి దించుతున్నది. ప్రజలపై పెను భారాలు మోపటమే కాక మొత్తం ప్రభుత్వ ఆస్తులను, ప్రజల మౌలిక సదుపాయాలను, సేవలను, వనరులను ప్రైవేటు శక్తుల పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటున్నది. ఈ ప్రమాదకర విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు, రాష్ట్రాలు సమైక్యంగా పోరాడటమే ముఖ్యమైన కర్తవ్యం.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

జనవాక్యం

స్కూల్ కాంప్లెక్స్ ఇబ్బందులు!

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడవ శనివారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఏర్పాటు చేస్తున్నట్లు పాఠశాల విద్యా శాఖ ప్రకటించింది. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరయ్యే ఉపాధ్యాయులు ఉదయం పాఠశాల పూర్తి చేసి మధ్యాహ్నం పిల్లలకు భోజనాలు పెట్టించిన తర్వాత ఒంటి గంట లోపల క్లస్టర్‌కు హాజరు కావాలని చెబుతున్నారు. కొన్ని పాఠశాలలు క్లస్టర్‌కు సుదూర ప్రాంతాలలో ఉన్నాయి. సమయానికి పోవాలనే తొందరలో ఉపాధ్యాయులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలో చాలా చోట్ల పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యాలు తక్కువగా ఉన్నాయి. దీంతో మహిళా ఉపాధ్యాయులు, అధిక వయసుగల ఉపాధ్యాయులు ఆటోలపై ఆధారపడాల్సి ఉంటుంది. దీంతో సమయానికి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు చేరుకోవడం కష్టం అవుతుంది. కనీసం ఉపాధ్యాయులు భోజనం చేసే దానికి కూడా సమయం సరిపోదు. కావున ప్రభుత్వం పునరాలోచన చేసి పూర్తి రోజు పాఠశాలకు సెలవు ప్రకటించి కాంప్లెక్స్ సమావేశాలు జరపాలి. స్కూల్ కాంప్లెక్స్ రోజున అవసరం వున్న ఉపాధ్యాయులకు సాధారణ సెలవులు వినియోగించుకోవడానికి అవకాశం కల్పించాలి.

- వాసిలి సురేష్

మీ రచనలను పంపాల్సిన మెయిల్ : editpageps@ gmail.com


బెంగళూరు బోణీ

- గుజరాత్‌పై ఘన విజయం
- మహిళల ప్రీమియర్ లీగ్



వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు బోణీ చేసింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ జట్టుపై 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గుజరాత్ విధించిన 202 పరుగుల లక్ష్యాన్ని 18.3 ఓవర్లలో కేవలం నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి అందుకుంది. బెంగళూరు జట్టులో ఓపెనర్ స్మృతి మంధాన (9), డానీ వైట్ హడ్జ్ (4) విఫలమైనా ఎల్లీ పెర్రీ (57), రిచా ఘోష్ (64) అర్ధశతకాలతో రాణించారు. రఘ్వి బిస్ట్ (25) పరుగులు చేసింది. రిచా ఘోష్‌తో పాటు కనికా అహుజా (30) నాటౌట్‌గా నిలిచారు. ఈ మ్యాచ్‌లో ముందుగా టాస్ నెగ్గిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 201పరుగులు చేసింది. ఓపెనర్, వికెట్ కీపర్ మూనీ(56), కెప్టెన్ గార్డ్‌నర్(79నాటౌట్) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. వోల్వడార్ట్(6), హేమలత(4) నిరాశపరిచినా.. వీరిద్దరు అర్ధసెంచరీలతో రాణించి జట్టు భారీస్కోర్‌కు దోహదపడ్డారు. మూనీ(56; 42బంతుల్లో 8ఫోర్లు)కి తోడు చివర్లో గార్డ్‌నర్(79నాటౌట్; 37బంతుల్లో 3ఫోర్లు, 8సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడింది. బెంగళూరు బౌలర్లు రేణుకా సింగ్‌ను మినహా.. జోహిత, వారేహామ్ బంతులను ఫోర్లు, సిక్సర్లు బాది ముచ్చెమటలు పట్టించింది. బెంగళూరు బౌలర్లలో రేణుక(2/25), అహుజ(1/19) మాత్రమే బౌలింగ్‌లో రాణించారు.

స్టాలిన్, ప్రకాశ్ కరత్ భేటీ



చెన్నై : తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధినేత ఎంకె స్టాలిన్, సిపిఎం కేంద్రకమిటీ సమన్వయకర్త, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ శుక్రవారం భేటీ అయ్యారు. చెన్నైలోని సిఎం అధికారిక నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వీరిద్దరు నాయకులు ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

శ్రీలంక క్లీన్‌స్వీప్

- రెండో వన్డేలో ఆస్ట్రేలియాపై ఘన విజయం

కొలంబో: ఆస్ట్రేలియాతో జరిగిన రెండు వన్డేల సిరీస్‌ను ఆతిథ్య శ్రీలంక జట్టు క్లీన్‌స్వీప్ చేసింది. ఆస్ట్రేలియాతో శుక్రవారం జరిగిన రెండో వన్డేలో శ్రీలంక జట్టు 175పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక జట్టు 50ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 281పరుగులు చేయగా.. ఛేదనలో ఆస్ట్రేలియాను కేవలం 107పరుగులకే ఆలౌట్ చేసింది. శ్రీలంక జట్టులో కుశాల్ మెండీస్(101) సెంచరీకి తోడు, మధుష్క(51), కెప్టెన్ అసలంక(78నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. ఇక ఆస్ట్రేలియా బ్యాటర్లలో కెప్టెన్ స్మిత్(29), ఇంగ్లిస్(22) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించగా.. మిగిలిన బ్యాటర్లు నిరాశపరిచారు. దీంతో ఆసీస్ జట్టు 24.2ఓవర్లలో 107పరుగులకే కుప్పకూలింది. శ్రీలంక బౌలర్లలో వెల్లెలగేకు నాలుగు, హసరంగ, ఫెర్నాండోకు మూడేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కుశాల్ మెండీస్‌కు, సిరీస్ అసలంకకు దక్కాయి.

మూనీ, గార్డ్‌నర్ అర్ధసెంచరీలు

- గుజరాత్ 201/5
- మహిళల ప్రీమియర్ లీగ్

వడోధర: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)లో గుజరాత్ జెయింట్స్ జట్టు భారీస్కోర్‌ను నమోదు చేసింది. టాస్ నెగ్గిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ స్మృతి మంధాన బౌలింగ్ ఎంచుకోగా.. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ జట్టు 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 201పరుగులు చేసింది. ఓపెనర్, వికెట్ కీపర్ మూనీ(56), కెప్టెన్ గార్డ్‌నర్(79నాటౌట్) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. వోల్వడార్ట్(6), హేమలత(4) నిరాశపరిచినా.. వీరిద్దరూ అర్ధసెంచరీలతో రాణించి జట్టు భారీస్కోర్‌ను దోహదపడ్డారు. మూనీ(56; 42బంతుల్లో 8ఫోర్లు)కి తోడు చివర్లో గార్డ్‌నర్(79నాటౌట్; 37బంతుల్లో 3ఫోర్లు, 8సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడింది. బెంగళూరు బౌలర్లు రేణుకా సింగ్‌ను మినహా.. జోహిత, వారేహామ్ బంతులను ఫోర్లు, సిక్సర్లు బాది ముచ్చెమటలు పట్టింది. బెంగళూరు బౌలర్లలో రేణుక(2/25), అహుజ(1/19) మాత్రమే బౌలింగ్‌లో రాణించారు.

స్కోర్‌బోర్డు..

గుజరాత్ జెయింట్స్ మహిళల ఇన్నింగ్స్: మూనీ (సి)మంధాన (బి)ప్రేమా రావత్ 56, వోల్వడార్ట్ (బి)రేణుక సింగ్ 6, హేమలత (సి)ప్రేమ రావత్ (బి)కనిక అహుజ 4, గార్డ్‌నర్ (నాటౌట్) 79, డోటిన్ (సి)హోడ్జే (బి)రేణుక సింగ్ 25, సిమ్రన్ షైక్ (బి)వారేహామ్ 11, హర్లిన్ (నాటౌట్) 9, అదనం 11. (20ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 201పరుగులు.

వికెట్ల పతనం: 1/35, 2/41, 3/85, 4/152, 5/182

బౌలింగ్: రేణుక సింగ్ 4-0-25-2, కిమ్ గ్రాత్ 4-0-34-0, జోషిత 4-0-43-0, కనిక అహుజ 3-0-19-1, వారేహామ్ 3-0-50-1, ప్రేమ రావత్ 2-0-26-1.

రూ.5 కోసం కాంట్రాక్టర్ కక్కుర్తి..

- రూ.5.20 లక్షల జరిమానా విధించిన వినియోగదారుల ఫారం

ప్రజాశక్తి - శంఖవరం (కాకినాడ జిల్లా)

అన్నవరం దేవస్థానంలో సెల్‌ఫోన్ భద్రపరుచుకునే ప్రయివేట్ కాంట్రాక్టర్ రూ.5కు కక్కుర్తి పడ్డాడు. దీంతో ఆ కాంట్రాక్టర్‌కు వినియోగదారుల ఫారం రూ.5.20 లక్షలు జరిమానా విధించి సంచలన తీర్పు ఇచ్చింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలావున్నాయి...గత ఏడాది నవంబర్ 3న కాకినాడకు చెందిన న్యాయవాది జల్లిగంపల లక్ష్మీనారాయణ అన్నవరం సత్యనారాయణ స్వామిని దర్శించుకునేందుకు వచ్చారు. దర్శనం కోసం వెళ్లే క్రమంలో ఆలయంలోని సెల్‌ఫోన్ డిపాజిట్ కేంద్రంలో తన మొబైల్‌ను భద్రపర్చారు. స్వామి దర్శనం తర్వాత మొబైల్ తీసుకునేందుకు డిపాజిట్ కేంద్రం దగ్గరకు వెళితే డిపాజిట్ కేంద్రంలో రూ.10 చెల్లించాలని సిబ్బంది చెప్పారు. అక్కడ రూ.10 అని బోర్డుపై ఎందుకు రాయలేదని లక్ష్మీనారాయణ ప్రశ్నించాడు. అయితే వారి నుంచి సరియైన సమాధానం రాకపోవడంతో ఆ న్యాయవాది ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా వారి నుంచి స్పందన లేకపోవడంతో డిసెంబర్ 4న కాకినాడ జిల్లా వినియోగదారుల ఫోరానికి ఫిర్యాదు చేశారు.. అయితే రూ.5 వసూలు చేసేందుకే అనుమతి ఉన్నట్లు గుర్తించారు. విచారణ జరిపిన వినియోగదారుల ఫోరం సంబంధిత కాంట్రాక్టర్ దగ్గర నుంచి అదనంగా వసూలు చేసిన రూ.5తో పాటు, మానసిక క్షోభకు రూ.15 వేలు, కోర్టు ఖర్చులకు రూ.5 వేలు చెల్లించాలని, అన్నవరం దేవస్థానానికి రూ.5 లక్షలు జరిమానా చెల్లించాలని ఫోరం అధ్యక్షుడు సిహెచ్.రఘుపతి వసంతకుమార్, సభ్యులు చెక్కా సుశీ, చాగంటి నాగేశ్వరరావు తీర్పు ఇచ్చారు.

లోకో పైలెట్‌పై దాడి

• సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ ఖండన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ రైల్వే యార్డ్‌లో విధులు నిర్వహిస్తున్న పి సురేష్ (సీనియర్ ఎల్‌పి/బిజెడ్)పై బ్లేడ్ బ్యాచ్‌గా అనుమానిస్తున్న వ్యక్తులు శుక్రవారం దాడి చేయడంతో తలకు బలమైన గాయమైందని విజయవాడ డివిజన్ సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ లీల పేర్కొన్నారు. దాడి చేసి గాయపరిచిన వారిని తక్షణమే అరెస్టు చేసి రన్నింగ్ స్టాఫ్‌కు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం కెబి3 ఎల్ఎస్ఎస్ ట్రైన్ ఎడిఎల్ ఫ్రమ్ బెజవాడ-ఎస్ఎల్‌పిడిలో పనిచేస్తున్న సందర్భంలో దాడి జరిగిందని తెలిపారు.

గాయపడిన ఉద్యోగిని హుటాహుటిన అంబులెన్స్‌లో ఆర్‌హెచ్‌కు తరలించి నట్లు ఆమె పేర్కొన్నారు. యార్డ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు రక్షణ కల్పించాలని, ఇటువంటి సంఘ టనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

సువెన్ ఫార్మా లాభాల్లో 78 శాతం వృద్ధి

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో సువెన్ పార్మాస్యూటికల్స్ 78 శాతం వృద్ధితో రూ.83.29 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.46.75 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ.234.16 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ3లో 38 శాతం పెరిగి రూ.322 కోట్లకు చేరింది.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

• బిఎస్ఎన్ఎల్ పెన్షనర్ల అసోసియేషన్ మహాసభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు



సదస్సులో మాట్లాడుతున్న జయరాజ్, చిత్రంలో ఎవి నాగేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలు, ఉద్యోగులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చే విధానాలపై పోరాటం చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు కోరారు. ఆలిండియా బిఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్ల అసోసియేషన్ ఎపి సర్కిల్ మూడో మహాసభ విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం యాకోబు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభను నాగేశ్వరరావు ప్రారంభోపన్యాసం చేశారు. మానిటైజేషన్ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించే విధానాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అవలంభిస్తున్నారని విమర్శించారు. పెన్షనర్లకు వైద్య సదుపాయాలను కూడా కేంద్రం అందించలేకపోతోందని తెలిపారు. బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు బ్రిటీష్ వారితో పోరాడిన చరిత్ర ఉందన్నారు. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ ప్రజలు, ఉద్యోగులకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకొచ్చే విధానాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

అసోసియేషన్ ఆలిండియా ప్రధాన కార్యదర్శి జయరాజ్ మాట్లాడుతూ.. 2017 నుంచి బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు పెన్షన్ సవరణ జరగలేదన్నారు. పెన్షనర్లు అనేక పోరాటాలు నిర్వహిస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ధోరణి పెన్షనర్ల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉందన్నారు. ఎన్‌పిఎస్‌తో తక్కువ పెన్షన్ వస్తుందన్నారు. ఇపిఎఫ్ పెన్షన్‌దారుల పరిస్థితి దారుణంగా ఉందని, కేవలం నెలకు రూ.2-3 వేలు మాత్రమే కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. ప్రభుత్వ ధోరణి పెన్షనర్ల ప్రయోజనానికి వ్యతిరేకంగా ఉందన్నారు. కేంద్రప్రభుత్వ ఉద్యోగుల జీవిత ప్రకటించిన యుపిఎస్ పెన్షన్ దగా తప్ప మరొకటి కాదని పేర్కొన్నారు. ఈ విధానం పెన్షనర్లకు తీవ్ర నష్టదాయకమన్నారు. హక్కుల కోసం ఇతర సంఘాలను కలుపుకొని పోరాటాలు నిర్వహించాలని కోరారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. పెన్షనర్ల పోరాటాలకు మద్దతు తెలిపారు. గుంటూరు - కృష్ణా పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. అసోసియేషన్ ఆలిండియా ఉపాధ్యక్షులు పి.అశోక్‌బాబు, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆలిండియా ఉపాధ్యక్షులు రమాదేవి, సర్కిల్ కార్యదర్శి ఎస్ కృష్ణ బాలాజీ ప్రసంగించిన ఈ సభలో అసోసియేషన్ మహాసభ నివేదికను సర్కిల్ ప్రధాన కార్యదర్శి కెవెంకీ బోస్ ప్రవేశపెట్టారు. అసోసియేషన్ ఆలిండియా ఉపాధ్యక్షులు బి శంకర్, తెలంగాణ సర్కిల్ కార్యదర్శి రామచంద్రుడు, ఆలిండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎవి అష్రఫ్, కోశాధికారి ఎంఎస్ఎన్ రెడ్డి, బెల్టాం కంట్రోలర్ ఆఫ్ కమ్యూనికేషన్ అకౌంట్ అధికారి తాడారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎపి సర్కిల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎం యాకోబు, నరేంద్ర రామారావు, కోశాధికారిగా ఎంఎస్ఎన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



తుది దశకు సచివాలయాల రేషనలైజేషన్

•17న యూనియన్లతో ప్రభుత్వం కీలక భేటీ • ప్రమోషన్ ఛానెల్‌పై స్పష్టత కోరనున్న ఉద్యోగ సంఘాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల రేషనలైజేషన్ ప్రక్రియ తుది దశకు చేరింది. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో సచివాలయాల శాఖకు సంబంధించిన నూటికి నూరు శాతం ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అంతకుముందు ఈ నెల 17న ప్రభుత్వం తరపున ఆ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ఉన్నతాధి కారులు, ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నేతృత్వంలో గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాలతో కీలక భేటీ నిర్వహించను న్నారు. కీలక భేటీలో ఆయా సంఘాల నుంచి వచ్చే వినతులు, సూచనలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం ఈ ప్రక్రియకు సంబంధించి ఎలా ముందుకు వెళ్తే బాగుంటుందనే అంశంపై తుది నివేదికను గ్రామ, వార్డు సచివాలయశాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి ఇవ్వనున్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, సచివాలయ ఉద్యోగ సంఘాలతో కీలక సమావేశం కావడంతో ఆయా సంఘాల సభ్యుల నుంచి, క్షేత్రస్థాయిలో రేషనలైజేషన్ ప్రక్రియలో ఎలా ముందుకు వెళ్తే బాగుంటుంది? ఉద్యోగ సంఘాలుగా ప్రభుత్వం ముందు ఏయే అంశాలు పెట్టాలి? ఏయే విషయాల్లో ప్రభుత్వ వైపు నుంచి వచ్చే ప్రతిపాదనల్లో ఏమైనా మార్పులు, చేర్పులు చేస్తే అత్యధిక శాతం ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది అనే అంశాలపై ఉద్యోగ సంఘాలు దృష్టి సారించాయి. ఇందులో భాగంగా గ్రామ సర్వేయర్ల యూనియన్ ఒక అడుగు ముందుకేసి ఇతర శాఖల్లోకి వెళ్లేందుకు గ్రామ సర్వేయర్లు ఎవరైనా ఆసక్తిగా ఉన్నారా? అనే అంశంపై అంతర్గతంగా ఆన్‌లైన్‌లో ఉద్యోగులతో ఓటింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా గ్రామ సర్వేయర్లుగా ఉంటూనే టెక్నికల్ హోదా ఇస్తూ ప్రమోషన్ ఛానెల్ ఇస్తే బాగుంటుందా? లేక ఇతర డిపార్టుమెంటుల్లోకి వెళితే బాగుంటుందా? అనే విషయంపై లోతుగా ఆయా సంఘాలు సభ్యులతో చర్చిస్తున్నట్లు తెలిసింది. రేషనలైజేషన్ గురించి ఇటీవల మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమినిటీస్ కార్యదర్శుల సేవలు, ఇంజినీరింగ్ శాఖల్లో, వెల్ఫేర్ అసిస్టెంట్ల సేవలను సాంఘిక సంక్షేమం, వెనుకబడిన, గిరిజన సంక్షేమ శాఖల్లో వినియోగించుకోవాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. అలాగే వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీల యూనియన్ కూడా పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుకు తీసుకురానున్నట్లు తెలిసింది. ఇందులో ప్రధానంగా హేతు బద్ధీకరణ కన్నా ముందుగానే జిల్లాల వారీ సీనియారిటీ జాబితాలను రూపొందించి ప్రమోషన్ కల్పించాలని, జిఎస్‌డబ్ల్యుఎస్‌లో ఇంతవరకు ప్రమోషన్ కల్పించిన విఎఎ, ఎహెచ్‌ఎ, విఎస్‌ఎ, ఎఎన్ఎమ్‌లాగా తమకు కూడా సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్‌కు సమానమైన హోదాలో ప్రమోషన్ ఛానెల్ కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించనున్నట్లు తెలిసింది. మున్సిపల్ శాఖ కింద తమ నియామకం జరిగినప్పటికీ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ లకు ఉపాధితోపాటు సంక్షేమ పథకాల అమలు లో కీలకపాత్ర తాము పోషిస్తున్న నేపథ్యంలో తమకు ప్రమోషన్ ఛానెల్ ఇతర అన్ని శాఖల్లో ఎంపిక చేసుకునేందు కు అవకాశాన్ని కల్పిం చాలని కోరనున్నట్లు తెలిసింది.

మణిపూర్‌ను మరింత గందరగోళంలోకి నెట్టే కుట్ర

• రాష్ట్రపతి పాలనపై మెయితీ గ్రూపు

ఇంఫాల్ : మణిపూర్‌లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి పాలనను విధించడాన్ని బిజెపికి అనుకూలంగా ఉండే మెయితీ గ్రూపు సైతం తీవ్రంగా ఆక్షేపించింది. 'ఇది అత్యంత దురదృష్టకరం, అప్రజాస్వామ్యకం. రాష్ట్రాన్ని మరింత గందరగోళంలోకి నెట్టే కుట్ర' అని మైయితీకి చెందిన కో ఆర్డినేటింగ్ కమిటీ ఆన్ మణిపూర్ ఇంటిగ్రిటీ (సిఒసిఒఎంఐ) శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. మణిపూర్‌లో బిజెపికి పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆకస్మాత్తుగా, అకారణంగా రాష్ట్రపతిపాలనను విధించడం వెనుక ఉద్దేశపూర్వక కుట్ర కనిపిస్తోందని విమర్శించింది. రాష్ట్రపతి పాలన విధించడం కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధిపై అనేక తీవ్ర ప్రశ్నలను లేవనెత్తుతోందని తెలిపింది. కీలకమైన అసెంబ్లీ సమావేశాలకు ముందు, ప్రజలకు ఎలాంటి వివరణ ఇవ్వకుండా ముఖ్యమంత్రి 'బలవంతంగా' రాజీనామా చేయడం ప్రజాస్వామ సూత్రాలకు సంపూర్ణంగా ద్రోహం చేయడమేనని పేర్కొంది. ఈ అధికారిక పన్నాగం మణిపూర్‌ను ముఖ్యంగా మెయితీ సమాజాన్ని సైనిక నియంత్రణ గుప్పెటలో ఉంచే ఎజెండాను సూచిస్తుందని విమర్శించింది. మణిపూర్ అసెంబ్లీ పదవీకాలం 2027 వరకూ ఉన్నా బిజెపి ఎమ్మెల్యేలు కొత్త నాయకుడ్ని ఎన్నుకోవడంలో విఫలమవ్వడాన్ని సిఒసిఒఎంఐ తీవ్రంగా తప్పుబట్టింది. 'ఎమ్మెల్యేల వైఫల్యంతో కేంద్ర నాయకత్వం జోక్యం చేసుకుని రాష్ట్రపతి పాలన విధించడానికి అవకాశాన్ని సృష్టించింది' అని పేర్కొంది. అప్రజాస్వామ్యికంగా రాష్ట్రపతి పాలనను విధించడం అమోదయోగ్యం కాదని, ఇది భారత ప్రజాస్వామ్య స్ఫూర్తికి వ్యతిరేకమని తెలిపింది. ఎమ్మెల్యేలు తక్షణమే కొత్త నాయకుడ్ని ఎన్నుకుని, వీలైనంత త్వరగా ప్రభుత్వాన్ని పునరుద్ధరించడానికి ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేసింది. అలాగే మణిపూర్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైనిక పాలన ముసుగులో తమను లొంగదీసుకునే ప్రయత్నాలను ఐక్యంగా ఎదరించాలని పిలుపునిచ్చింది. ఈ సంక్షోభం కేవలం నాయకత్వానికి సంబంధించిదని కాదని, మణిపూర్ భవిష్యత్, ప్రజాస్వామ్య హక్కుల మనుగడకు సంబంధించిందని సిఒసిఒఎంఐ పేర్కొంది.

సామాజిక కార్యకర్త విమలా బహుగుణ మృతి

డెహ్రాడూన్ : ప్రముఖ పర్యావరణ వేత్త సుందర్‌లాల్ బహుగుణ భార్య, సామాజిక కార్యకర్త విమలా బహుగుణ (93) శుక్రవారం మృతి చెందారు. సర్వోదయ కార్యకర్త గానూ, బీహార్‌లో 1953-55లో జరిగిన భూదాన ఉద్యమంలో ఆమె పని చేశారు. చిన్నారుల విద్యాభివృద్ధికి, గ్రామీణ మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంలోనూ విశేష సేవలందించారు. చిప్కో ఉద్యమంతో పాటు మద్యపాన వ్యతిరేక ఉద్యమంలో మహిళలకు ప్రేరణ కల్పించారు. ఆమె భర్త, చిప్కో ఉద్యమ వ్యవస్థాపకులు సుందరల్ బహుగుణ 2021 మే 21న మరణించిన సంగతి విదితమే.

'పుల్వామా' అమర జవాన్లకు నివాళి

న్యూఢిల్లీ : పుల్వామా ఉగ్రదాడిలో మరణించిన అమర జవాన్లకు శుక్రవారం దేశవ్యాప్తంగా ఘన నివాళులర్పించారు. '2019లో పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు నివాళులు' అంటూ

అమెరికా పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. అమరవీరుల త్యాగం, దేశం పట్ల వారి అచంచలమైన అంకిత భావాన్ని ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని మోడీ పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్ తదితరులు అమరజవాన్లకు నివాళులర్పించారు. 2019 ఫిబ్రవరి 14న జమ్మూకాశ్మీర్‌లోని పుల్వామా ప్రాంతంలో సిఆర్‌పిఎఫ్ జవాన్లపై ఉగ్రవాదులు జరిపిన దాడిలో 40 మంది చనిపోయిన సంగతి తెలిసిందే.

పాక్‌లో బొగ్గు గని కార్మికుల వ్యాన్‌పై దాడి

• 10 మంది మృతి

ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ రాష్ట్రంలో బొగ్గు గని కార్మికులతో ప్రయాణిస్తున్న పికప్ వ్యాన్ లక్ష్యంగా జరిగిన దాడిలో 10 మంది మరణించారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. షహ్రగ్ జిల్లాలోని హర్నై ప్రాంతంలో కోల్‌మైన్స్ ఏరియా పిఎండిసి 94లో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఇడి) పేల్చి ఈ దాడి చేశారు. ఈ పేలుడు విషయం తెలిసిన వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు క్షతగాత్రుల్ని షహ్రగ్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుల్ని సమీపంలోని ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రం, షాంగ్లా జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించినట్లు బలూచిస్తాన్ ప్రభుత్వ ప్రతినిధి షాహిద్ రింద్ తెలిపారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం రోడ్డు సమీపంలో పాతిన ఐఇడితో ఈ దాడికి పాల్పడినట్లు వెల్లడైందని చెప్పారు.



ఆస్పత్రిలో చేరిన పోప్ ఫ్రాన్సిస్

వాటికన్ సిటీ : శ్వాసకోశ సమస్య (బ్రాంకైటీస్)తో ఇబ్బంది పడుతున్న పోప్ ఫ్రాన్సిస్‌ను శుక్రవారం ఆస్పత్రిలో చేర్చారు. దీంతో రాబోయే మూడు రోజుల్లో ఆయన పాల్గొనాల్సిన పలు కార్యక్రమాలు రద్దయ్యే అవకాశం వుంది. శుక్రవారం ఉదయం జరిగిన సమావేశాల్లో మాట్లాడేందుకు పోప్ ఇబ్బంది పడడం కనిపించిందని, అందుకే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్ళినట్లు వాటికన్ ఒక ప్రకటనలో పేర్కొంది. వారం రోజులకు పైగా పోప్ శ్వాసనాళాల వాపుతో బాధపడుతున్నారని తెలిపింది. ఆయనకు చికిత్స కొనసాగిస్తూ, కొన్ని వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాల్సి వుందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. 2013 నుండి పోప్‌గా బాధ్యతలు చేపట్టిన ఫ్రాన్సిస్ గత రెండేళ్ళుగా ఫ్లూ, ఇతర ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. యువకుడిగా వున్నపుడే ఆయన ఒక ఊపిరితిత్తిలోని కొంత భాగాన్ని తొలగించారు. ఇటీవల కాలంలో ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లతో బాగా ఎక్కువగా బాధపడుతున్నారు. మానసికంగా ఆయన ఆరోగ్యంగానే వున్నారని, కానీ మాట్లాడడంలోనే ఇబ్బందులు అధికంగా ఎదుర్కొంటున్నారని సంబంధికులు తెలిపారు.

'రఘురామ' క్వాష్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కానిస్టేబుల్‌పై దాడి కేసులో రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు మూడు వారాలకు వాయిదా వేసింది. గతంలో హైదరాబాద్ గచ్చిబౌలి బౌల్డర్ హిల్స్‌లోని రఘురామ కృష్ణరాజు నివాసం వద్ద మస్తీలో డ్యూటీలో ఉన్న తనపై రఘురామ కృష్ణరాజుతో పాటు మరో నలుగురు దాడి చేశారని ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్ ఎస్‌కె ఫరూక్ బాషా ఫిర్యాదు చేశారు. ఈ కేసులో తనతోపాటు తన కుమారుడు, ఇతరులపై తెలంగాణలో దాఖలైన కేసును క్వాష్ చేయాలని రఘురామ.. హైకోర్టును ఆశ్రయించగా తిరస్కరించింది. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తు 2022 జులై 12న సుప్రీకోర్టులో రఘురామ సవాల్ చేశారు. ఆ పిటిషన్ శుక్రవారం జస్టిస్ జెకె మహేశ్వరి, జస్టిస్ అరవింద్ కుమార్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కానిస్టేబుల్ ఫరూక్ బాషా తరపున వకాలత్ దాఖలు చేయడానికి కొంత సమయం కావాలని ఆయన తరపు న్యాయవాది ధర్మాసనానికి అభ్యర్థించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ధర్మాసనం, వకాలత్ దాఖలు చేయడానికి రెండు వారాల సమయం ఇచ్చింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

డబుల్ ఇంజన్ ప్రభుత్వం దివాలా

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యత నుండి తప్పించుకోలేదని పేర్కొంది. వివిధ కమ్యూనిటీల ప్రతినిధులతో చర్చలు జరపడం ద్వారా ఇప్పటికే తగిలిన గాయాలను మాన్పేందుకు తక్షణమే చర్యలు చేపట్టాల్సిన అవసరం వుందని సూచించింది. రాష్ట్రంలో తిరిగి సాధారణ పరిస్థితులు పునరుద్ధరించేందుకు, శాంతి, సామరస్యతలను నెలకొల్పేందుకు గానూ న్యాయమైన పరిష్కారాలు కనుగొనడానికి అన్ని రాజకీయ పార్టీలను విశ్వాసం లోకి తీసుకోవాలని పేర్కొంది. అదే సమయంలో రాష్ట్ర ప్రజల ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని, నిర్దిష్ట కాలపరిమితిలో అక్కడ ఎన్నికలు కూడా నిర్వహించాలని కోరింది.

అది వ్యక్తిగత వ్యవహారం

- అదాని కేసుపై జర్నలిస్టు ప్రశ్నకు మోడీ బదులు
- మిత్రుడి అవినీతిని కప్పిపుచ్చే చర్యగా ప్రతిపక్షాల విమర్శ

వాషింగ్టన్ : దేశాన్ని ఒక కుదుపు కుదిపేసిన అదానీ గ్రూపు సంస్థల కుంభకోణంపై అమెరికాలో నమోదైన కేసు గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దాటవేత వైఖరి అవలంబించారు. అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన సమావేశంలో గౌతమ్ అదానీ కేసును ప్రస్తావించారా? ఈ కేసులో చర్యలు తీసుకోవాలని ఆయనను అడిగారా?'....అని చర్చల అనంతరం జరిగిన మీడియా సమావేశంలో మోడీని ఒక జర్నలిస్టు ప్రశ్నించగా..ద్వైపాక్షిక చర్చల్లో వ్యక్తిగత అంశాలు ప్రస్తావ-నకు రావని దాటవేశారు. 'ఆసియాలోని సంపన్నుల్లో ఒకరు, ప్రధాని నరేంద్ర మోడీకి సన్నిహితుడిగా భావించే అదానీకి వ్యతిరేకంగా అమెరికాలో దాఖలైన కేసు గురించి ట్రంప్‌తో చర్చించారా అని మిమ్మల్ని అడగవచ్చా? ఈ కేసు విషయంలో చర్య తీసుకోవాల్సిందిగా మీరు అధ్యక్షుడిని అడిగారా?' అని ఆ విలేకరి ప్రధానిని ప్రశ్నించారు. దీనికి మోడీ స్పందిస్తూ 'గౌతమ్ అదానీ వ్యవహారం వ్యక్తిగతమైన అంశం. రెండు దేశాల నేతల మధ్య జరిగే సమావేశంలో అలాంటి వ్యక్తిగత అంశాలు చర్చకు రావు. భారత్ ప్రజాస్వామిక దేశం, వసుధైక కుటుంబం మన సంస్కృతి. ఈ ప్రపంచాన్నంతటినీ ఒక కుటుంబంగా చూస్తాం. ప్రతి భారతీయుడూ నా వారేనని నమ్ముతాం' అని ఇలా ఏవేవో చెప్పుకుంటూ వెళ్లిన మోడీ..ఇరు దేశాల ద్వైపాక్షిక చర్చల్లో వ్యక్తిగత అంశాలు ప్రస్తావనకు రావని ముక్తాయింపు ఇచ్చారు.

అవినీతిని కప్పి పుచ్చుకోవడమే : రాహుల్

విదేశాల్లో అదానీ అవినీతి కప్పిపుచ్చేందుకే మోడీ ఇదంతా చేశారని ప్రతిపక్షాలు విమర్శించాయి. "దేశంలో దీని గురించి ప్రశ్నిస్తే మౌనం, విదేశాల్లో ప్రశ్నిస్తే వ్యక్తిగత అంశం. అమెరికాలో కూడా అదానీ అవినీతిని కప్పిపుచ్చడానికి ప్రధాని ప్రయత్నిస్తున్నారు. మోడీకి మిత్రుడి జేబు నిండడమే జాతి నిర్మాణమైనపుడు దేశ సంపదను దోపిడీ చేస్తూ ఆయన తీసుకునే లంచాలు, ముడుపులు వ్యక్తిగత అంశాలే అవుతాయి." అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. అదానీతో గల స్నేహాన్ని అమెరికాలో మోడీ ప్రదర్శించారని ఆప్ వ్యాఖ్యానించింది. బలవంతంగా పత్రికా సమావేశంలో పాల్గొనాల్సి రావడంతో మోడీకి కోపం, అసహనం పెరిగాయని తృణమూల్ కాంగ్రెస్ వ్యాఖ్యానించింది.

ట్రంప్ రావడంతో పరిస్థితి మారింది

భారత్‌లో సౌర విద్యుత్ కాంట్రాక్టులకు సంబంధించి వెలుగులోకి వచ్చిన 250 మిలియన్ డాలర్ల ముడుపుల కేసు, సెక్యూరిటీల కుంభకోణంలో గౌతమ్ అదానీ, ఆయన వ్యాపార సంస్థకు చెందిన పలువురు ఎగ్జిక్యూటివ్‌లపై అమెరికా అధికారులు గత సంవత్సరం నవంబర్ 20న అభియోగాలు మోపారు. అమెరికా న్యాయ శాఖ మోపిన అభియోగాల్లో గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీ, ఇతర భాగస్వాముల పేర్లు ఉన్నాయి. అమెరికా పెట్టుబడిదారులను అదానీ గ్రూప్ తప్పుదోవ పట్టించిందని, పెద్ద ఎత్తున లాంచాలు ఇవ్వజూపిందని ప్రాసిక్యూషన్ ఆరోపించింది. సౌర విద్యుత్ కాంట్రాక్టులు పొందేందుకు అదానీ, ఆయన భాగస్వాములు 265 మిలియన్ డాలర్లు (సుమారు రూ.2,236 కోట్లు) ఇచ్చేందుకు కుట్ర పన్నారని వివరించింది. అయితే ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ తోసిపుచ్చింది. వాటికి ఆధారాలే లేవని తెలిపింది. కాగా జో బైడెన్ అమెరికా అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఈ కేసు నమోదైంది. అయితే ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. అదానీ కేసుకు వర్తించే విదేశీ అవినీతి చర్యల చట్ట నిబంధనల అమలును ట్రంప్ ప్రభుత్వం నిలిపివేసింది. ఆ తర్వాత అదానీపై అభియోగాలు మోపాలన్న అప్పటి బైడెన్ ప్రభుత్వ 'ప్రశ్నించదగిన' నిర్ణయాలను ఆరుగురు అమెరికా కాంగ్రెస్ సభ్యులు విమర్శించారు. వీటిని సమీక్షించాలని కొత్తగా నియమితులైన అటార్నీ జనరల్ పమేలా బాండీని కోరారు.

ముచ్చటగా మూడుసార్లే...

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి ప్రమాణస్వీకారం చేసిన తర్వాత మోడీ ఆ దేశంలో పర్యటించడం ఇదే మొదటిసారి. శ్వేతసౌధంలో నాలుగు గంటల పాటు ఇరువురి మధ్య జరిగిన చర్చల్లో పలు ద్వైపాక్షిక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. పరస్పర ప్రయోజనమున్న ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై వారు చర్చించారు. స్వదేశంలో పాత్రికేయుల సమావేశాలకు ఆమడ దూరంలో ఉండే మోడీ, అమెరికా పర్యటన సందర్భంగా ట్రంప్‌తో కలిసి విలేకరులతో ముచ్చటించారు. గత 16 సంవత్సరాలలో మోడీ విలేకరుల సమావేశానికి హాజరవడం ఇది కేవలం మూడోసారి మాత్రమే. అవన్నీ విదేశీ గడ్డపై జరిగిన సమావేశాలే కావడం గమనార్హం. 2015 నవంబరులో బ్రిటన్ ప్రధాని డేవిడ్ కామెరూన్, 2023 జూన్‌లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, తాజాగా అధ్యక్షుడు ట్రంప్‌తో కలిసి విలేకరులతో ముచ్చటించారు.



అదానీకి మోడీ రక్షణ గోడలా నిలుస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో శుక్రవారం వైరల్‌గా మారిన వ్యంగ్య చిత్రం



చైనాలో హేనన్ ప్రావిన్సులోని ఝుమాదియన్ నగరంలో నిర్వహించిన జాబ్ మేళాకు తరలివచ్చిన ఉద్యోగార్థులు

లేబర్ మార్కెట్ స్థిరీకరణకు చైనా చర్యలు

- కోటిన్నర మందికి ఉపాధి కల్పన
- దేశవ్యాప్తంగా జాబ్‌మేళాలు

బీజింగ్ : లేబర్ మార్కెట్‌ను సుస్థిరీకరించడానికి, సజావుగా వాణిజ్య కార్యకలాపాలు సాగేందుకు వీలుగా చైనా తన ప్రయత్నాలు ముమ్మరం చేసింది. దేశవ్యాప్తంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌ల్లో ఉద్యోగ మేళాలు నిర్వహిస్తోంది. వలస కార్మికులు తిరిగి తమ విధులకు హాజరయ్యేందుకు సాయపడేలా బస్సులు, రైళ్ళు, విమానాలు నడుపుతామని హామీలిచ్చింది. జనవరి మధ్య నుండి ఫిబ్రవరి 11 వరకు దేశవ్యాప్తంగా మొత్తంగా 22 వేల రిక్రూట్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించారు. 1.5 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు చైనా మానవ వనరుల మంత్రిత్వ శాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది.

వసంతోత్సవాల అనంతరం దాదాపు 3,70,000 మంది వలస కార్మికులు తమ ఉద్యోగాలకు తిరిగి హాజరు కాగా, వీరి కోసం 15 వేలకు పైగా బస్సులు, రైళ్ళు, విమానాలను ఏర్పాటు చేసింది. వ్యాపార వాణిజ్య వర్గాలకు చెందిన విధుల్లో పాల్గొనే కార్మికుల అవసరాలను పరిష్కరించడంపై ప్రధానంగా దృష్టి పెట్టినట్లు మానవ వనరుల శాఖ తెలిపింది.

నేడు మరో ముగ్గురు బందీలు విడుదల : హమాస్

టెహ్రాన్ : తమ వద్దనున్న బందీల్లో మరో ముగ్గురిని హమాస్ శనివారం విడుదల చేయనుంది. ఆ బందీల పేర్లను శుక్రవారం ప్రకటించింది. అలెగ్జాండర్ ట్రూఫనోవ్, సగై డెకెల్-చెన్, యారి హర్న్ అనే ముగ్గురు ఇజ్రాయిలీలను విడుదల చేస్తున్నట్లు హమాస్, పాలస్తీయన్ ఇస్లామిక్ జిహాద్ (పిఐజె) వెల్లడించాయి. ఈ జాబితాను ఇజ్రాయిల్ కూడా ఆమోదించింది. అలాగే ముగ్గురు బందీలకు విడుదలకు ప్రతిగా 369 మంది పాలస్తీనీయుల్ని ఇజ్రాయిల్ విడుదల చేయనుంది. కాగా, ఇజ్రాయిల్ దాడుల కారణంగా ఇప్పటి వరకూ 48,239 మంది మరణించారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. 1,11,676 మంది గాయపడినట్లు తెలిపింది. అయితే గాజా ప్రభుత్వ మీడియా కార్యాలయం మృతుల సంఖ్య 61,709కు చేరినట్లు ప్రకటించింది. శిథిలాల కింద గల్లంతైన వేలాది మంది మృతి చెందినట్లు ధృవీకరించింది. కాగా గాజాను స్వాధీనం చేసుకుంటామనే డోనాల్డ్ ట్రంప్ ప్రకటనపై చర్చించడానికి సౌదీ అరేబియా సమావేశం నిర్వహించనుంది. ఈ నెల 20న జరిగే సమావేశంలో అతిథ్య సౌదీ అరేబియాతో పాటు మరో నాలుగు అరబ్ దేశాల నాయకులు పాల్గొననున్నారు.

చట్టాలు ఫలాన విధంగా ఉండాలంటూ

శాసనవ్యవస్థను కోర్టులు నిర్దేశించలేవు

- సుప్రీం కోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : చట్టాన్ని ఫలాన విధంగానే రూపొందించాలని న్యాయస్థానాలు శాసన వ్యవస్థను ఆదేశించలేవని సుప్రీం కోర్టు శుక్రవారం వ్యాఖ్యానించింది. ఈ అంశంపై పిల్‌ను పరిష్కరించిన ఢిల్లీ హైకోర్టు గతేడాది ఫిబ్రవరిలో జారీ చేసిన ఆదేశాలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై విచారిస్తూ జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జితో కూడిన బెంచ్ ఈ వ్యాఖ్యలు చేసింది. 'ప్రతి అంశాన్ని పరిశీలించి పార్లమెంట్ కొత్త చట్టాన్ని తీసుకువస్తుంది. రిట్ పిటిషన్‌పై విచారణ సమయంలో హైకోర్టులు లేదా సుప్రీంకోర్టు ప్రత్యేకంగా ఈ తరహాలోనే చట్టాన్ని ఆమోదించాలని చట్టసభను ఆదేశించలేవు.' అని బెంచ్ పేర్కొంది. ఈ పిటిషన్ విచారణకు తిరస్కరించింది.

కేంద్రం తరపున వాదనలు వినిపిస్తున్న న్యాయవాది భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బిఎన్ఎస్ఎస్)లో సెక్షన్ 230ని ప్రస్తావిస్తూ, ఆ పిటిషన్ చెల్లనిదిగా పేర్కొన్నారు. పోలీసు రిపోర్ట్‌పై విచారణా చర్యలు చేపట్టిన ఏ కేసులోనైనా మేజిస్ట్రేట్ అందుకు సంబంధించిన పత్రాల కాపీని నిందితుడు, బాధితులకు అందచేయాలని సెక్షన్ 230 చెబుతోందని పేర్కొన్నారు. పోలీసు రిపోర్టుతో పాటు ఎఫ్ఐఆర్ నివేదిక కూడా అందచేయాల్సి వుంటుందన్నారు. కానీ ఫిర్యాదీదారుడు లేదా బాధితుని వాదనలను వినాల్సిన, లేదా విచారణకు ముందస్తు క్రిమినల్ ప్రొసీడింగ్స్‌లో పాల్గొనాల్సిన హక్కు గురించి ఈ సెక్షన్ చెప్పడం లేదంటూ పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. ఫిర్యాదీదారులు లేదా బాధితులకు ఉచితంగా చార్జిషీట్ కాపీని అందచేయాలని ఆ మేరకు జిల్లా కోర్టులకు, లేదా పోలీసులకు ఆదేశాలివ్వాలని ఆ పిల్ కోరింది. దానిపై గతేడాది విచారించిన ఢిల్లీ హైకోర్టు అవసరమైతే విచారణ ముందస్తు, విచారణా సమయాల్లో జరిగే కార్యకలాపాల్లో పాల్గొనేందుకు బాధితులు లేదా ఫిర్యాదీదారులకు తగినన్ని హక్కులు ఇవ్వబడ్డాయని తెలిపింది.

అమెరికా నుంచి నేడు రెండో విమానం రాక

చండీగఢ్: సరైన పత్రాలు లేని భారత వలసదారులతో కూడిన మరో అమెరికా సైనిక విమానం శనివారం అమృత్‌సర్‌కు చేరుకోనుంది. 119 మంది ఉన్న ఈ విమానం రాత్రి 10 గంటల సమయానికి పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు స్వీకరికంచిన డోనాల్డ్ ట్రంప్ తమ దేశంలో ఉంటున్న వలసదారులపై తీవ్ర చర్యలకు పాల్పడుతున్న సంగతి తెలిసిందే. గత నెలలో మొదటిసారిగా 104 మంది భారత వలసదారుల్ని విమానంలో తరలించారు. కాగా, శనివారం భారత్ చేరుకునే 119 మందిలో 67 మంది పంజాబ్‌కు, 33 మంది హర్యానాకు చెందిన వారు. అలాగే గుజరాత్‌కు చెందిన వారు ఎనిమిది మంది, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు ముగ్గురు, గోవా, మహారాష్ట్ర, రాజస్థాన్‌కు చెందిన వారు ఇద్దరేసి చొప్పున ఉన్నారు. హిమాచల్ ప్రదేశ్, జమ్మూకాశ్మీర్‌లకు చెందిన వారు ఒక్కొరు ఉన్నారు. కాగా, ఆదివారం కూడా అమృత్‌సర్‌కు అమెరికా నుంచి మరొక విమానం వచ్చే అవకాశ ఉంది. కాగా, అమెరికా నుంచి వస్తున్న విమానాలు అమృత్‌సర్‌లోనే దిగడంపై విమర్శలు వస్తున్నాయి. పంజాబ్‌ను అప్రతిష్టపాలు చేయడానికే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమెరికా విమానాలను అమృత్‌సర్‌లో దింపడానికి అనుమతించిందని పంజాబ్ ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ ఛీమా విమర్శించారు. ఈ విమానాలు గుజరాత్, హర్యానా లేదా ఢిల్లీలో ఎందుకు ల్యాండ్ అవ్వడం లేదని ప్రశ్నించారు.

బతుకు పోరాటాన్ని గుర్తించలేకపోయారు !

- ఉచితాలపై జస్టిస్ గవాయ్ వ్యాఖ్యలపై బృందా కరత్ లేఖ



న్యూఢిల్లీ : యేటికేడు పెరిగిపోతున్న నిరుద్యోగం, ప్రమాదకరమైన పని పరిస్థితులు, తక్కువ వేతనాలు వంటి సమస్యలను ఎదుర్కొంటూనే దేశ కార్మిక వర్గం తమ మనుగడ కోసం సాగిస్తున్న పోరాటాన్ని గుర్తించడంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ విఫలమయ్యారని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ విమర్శించారు. ఉచితాలు వద్దని, దానివల్ల ప్రజలు సోమరిపోతులుగా మారిపోతారంటూ న్యాయమూర్తి గవాయ్ వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బృందాకరత్ శుక్రవారం ఆయనకు బహిరంగ లేఖ రాశారు. ఈ వ్యాఖ్యలతో, ప్రభుత్వం నుండి సామాజిక ప్రయోజనాలు అందుకునే వారిపై సమాజ అభిప్రాయాలు మారిపోయే పరిస్థితులు ఎదురవుతాయని పేర్కొన్నారు. దేశ రాజధానిలో పట్టణ ప్రాంత నిరాశ్రయులకు రాత్రుళ్ల షెల్టర్ల కొరతపై దాఖలైన పిటిషన్లు విచారిస్తూ బుధవారం జస్టిస్ గవాయ్ ఈ వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అపరిమితమైన ఉచితాలు నిరుపేదలను ఎలాంటి పనీపాటా చేయని సోమరిపోతుల్లా మారుస్తాయని, వారు పని వెతుక్కోవడానికి కూడా ఎలాంటి చొరవ తీసుకోరని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ వ్యాఖ్యలు దేశంలో చెమటోడ్చి పనిచేసే మహిళలకు ఎలాంటి న్యాయం చేయవని బృందా కరత్ అన్నారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు నేరుగా నగదు బదిలీ చేసే పథకం గురించి ఆమె ప్రస్తావిస్తూ.. మహిళలకిచ్చే ఇటువంటి స్టయిఫండ్‌ను సామాజిక నష్టపరిహారంగా పరిగణించాలన్నారు. అంతేకానీ ప్రభుత్వమిచ్చే ఉచితంగా పరిగణించరాదని తెలిపారు. సగటున భారతీయ మహిళలు రోజు ఇంట్లో ఏడున్నర గంటలు పనిచేస్తున్నారని, ఇదంతా కూడా జీతం బత్తెం లేని పనేనని అంటే మొత్తంగా వారానికి దాదాపు 50 గంటలు పని చేస్తున్నారని చెప్పారు. బయటచేసే పనికి ఆ మహిళలకు వేతనం వస్తుందని, కానీ ఇంట్లో చేసేపని వల్ల ఆమె పనిగంటలు పెరుగుతాయంతేనని అన్నారు.

2023-24లో ఎస్‌బిఐ చేసిన సర్వే ప్రకారం, మహిళలకు ఎలాంటి చెల్లింపులు లేని ఆ పనికి గనక డబ్బులిచ్చినట్లైతే, ఏడాదికి ఏకంగా 22 లక్షల కోట్ల రూపాయిలు అయ్యేదని బృందా కరత్ తన లేఖలో పేర్కొన్నారు. అంటే ఇది ఆ ఏడాది జిడిపిలో దాదాపు 7 శాతంగా వుంది. ఇలా మహిళలు చేసే పనికి సామాజికంగా ఎలాంటి గుర్తింపు వుండడం లేదన్నారు. పైగా ఆ మహిళలు ఏమీ పనిచేయడం లేదంటూ అవమానిస్తారని అన్నారు. న్యాయమూర్తి కూడా అలాంటి వ్యాఖ్యలే చేసి ఇటువంటి భావనకు తోడ్పడడం విచారకరమని అన్నారు. ఉచిత రేషన్ గురించి ప్రస్తావిస్తూ, ప్రపంచంలోకెల్లా భారతదేశం అతిపెద్ద పోషకాహార లోపం కలిగిన దేశమని అన్నారు. ఈ కారణంగానే ప్రజలు, సంఘాలు రేషనింగ్ వ్యవస్థలో అదనపు వస్తువులు చేర్చాలని కోరుతూ వుంటారన్నారు. అందుబాటు ధరల్లో మరింత ఎక్కువగా ప్రోటీన్ అందేలా, పోషకాహారం సమకూరేలా చూడాలని భావిస్తు వుంటారని బృందాకరత్ పేర్కొన్నారు. అయినా సరే, ఎవరూ కూడా కేవలం ఉచిత రేషన్‌లపైనే బతకలేరని పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు వ్యాఖ్యలు దురదృష్టకరం : ఎఐఎడబ్ల్యుయు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సంక్షేమ పథకాలపై సుప్రీంకోర్టు వ్యాఖ్యలు దురదృష్టకరమని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ అన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలు శ్రామికుల శ్రమను, సామాజిక తరగతులను అవమానించే విధంగా ఉన్నాయన్నారు. వాస్తవాల ఆధారంగా సుప్రీంకోర్టు తిరిగి పరిశీలించాలని కోరారు. శుక్రవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతకూ రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు ఇవ్వడం వల్ల ప్రజలు ఇంటి దగ్గరే ఉంటున్నారన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలు అత్యంత బాధాకరమన్నారు. వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలు, ఇతర కార్మికులు పని చేయకుండానే రెండు లక్షల కోట్ల జిడిపి వచ్చిందా?, 33 కోట్ల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు పని చేయకుండానే ఉత్పత్తి అయ్యాయా? అని ఆయన ప్రశ్నించారు. ప్రజా ప్రయోజనాల కేసులు వచ్చినప్పుడు న్యాయమూర్తులు అత్యున్నతంగా వ్యవహరించేవారని, ఇటీవల కాలంలో కోర్టులు సామాజిక న్యాయం, మత సామరస్యం, శ్రమజీవులు పట్ల హేళనగా మాట్లాడుతున్న ఘటనలు చూస్తున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైనదన్నారు. ఇప్పటికైనా సుప్రీం ధర్మాసనం తన వ్యాఖ్యలను పునర్ సమీక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రేమికుల రోజే ఘాతుకం

(మొదటి పేజీ తరువాయి)

పడి ఉండడాన్ని పాల కోసం ఆమె ఇంటికి వచ్చిన వారి బంధువు జయమ్మ చూసి కేకలు వేశారు. వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు, బంధువులు ఆమెను 108లో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అక్కడికి డిఎస్‌పి కొండయ్యానాయుడు, సిఐలు సత్యనారాయణ, ఎరిషావల్లి, రామచంద్ర వైద్యులను సంప్రదించి మెరుగైన వైద్యం అందించే ఏర్పాటు చేశారు. అనంతరం మేజిస్ట్రేట్ వచ్చి బాధితురాలి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. బాధితురాలి తండ్రికి మంత్రి నారా లోకేష్, హోం మంత్రి వంగలపూడి అనిత ఫోన్ చేశారు. సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిసివేసిందని లోకేష్ పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటన జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ యంత్రాంగాన్ని కోరారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గుర్రంకొండ పోలీసులు తెలిపారు. బాధిత యువతిని ఆస్పత్రిలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్ బాష, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, ఎఎస్‌పి వెంకటాద్రి పరామర్శించారు. తీవ్రంగా గాయపడిన గౌతమిని బెంగుళూరుకు తరలించారు. యువతి పూర్తిగా కోలుకునే వరకు వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. నిందితుడిని పట్టుకోవడానికి నాలుగు బృందాలను ఏర్పాటు చేశామని ఎస్‌పి తెలిపారు.

యువతిపై దాడికి జగన్ ఖండన

యువతిపై ఉన్మాది దాడిని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఒక ప్రకటనలో ఖండించారు. మహిళల భద్రత విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని విమర్శించారు.

జోరుగా కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

చేయడంతో పాటు నీరు దుర్వినియోగం కాకుండా నిర్దేశిత కెపాసి టీని విడుదల చేయడం, అవసరం లేనప్పుడు నీటి విడుదలను తగ్గించడం వంటి పనులు చేయించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది.

కెపిఎంజి నివేదిక తరువాతే

అధికారుల ప్రతిపాదనలు ఎలా ఉన్నప్పటికీ కెపిఎంజి నుండి అధ్యయన నివేదిక అందిన తరువాతే వివిధ అంశాలకు సంబంధించి తుది నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకోనుంది. పంట కాలువలను ప్రైవేటుకు అప్పగించే విధివిధానాలతో పాటు, ఆ సంస్థలకు ఏ పద్ధతిలో చెల్లింపులు చేయాలి? నిర్వహణా ఖర్చు మొత్తాన్ని రైతుల నుండి వసూలు చేయాలా? కొంత ప్రభుత్వం భరించాలా? అనే అంశాలపై కెపిఎంజి నివేదిక అందిన తరువాతే నిర్ణయం తీసుకోనున్నారు.

గతంలో ఇలా...

గతంలోనూ తెలుగుదేశం ప్రభుత్వమే సాగునీటి సంస్కరణల అంశాన్ని తెరమీదకు తీసుకువచ్చింది. ప్రభుత్వం పొలాలకు నీటిమీటర్లు పెట్టగా రైతుల్లో తీవ్ర వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గింది అప్పట్లో ప్రయోగాత్మకంగా కృష్ణాజిల్లాలో వీరంకిలాకు వద్ద మేడూరు, హనుమంతపురం ఛానళ్లకు మీటర్లు ఏర్పాటు చేశారు. వీటిని పరిశీలించేందుకు ప్రపంచబ్యాంకు ప్రతినిధులు వచ్చారు. విషయం తెలుసుకున్న రైతులు ఆందోళనకు దిగి వారిని అడ్డుకున్నారు. దీంతో అప్పట్లో ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్న ప్రభుత్వం తాజాగా మళ్లీ తెరమీదకు తెచ్చింది.

సుంకాలే ప్రధాన సమస్య : ట్రంప్

వాషింగ్టన్ : 'భారతీయ మార్కెట్లలో ప్రవేశించడానికి అసమంజసంగా ఉన్న అధిక సుంకాలు మాకు ప్రధాన సమస్యగా ఉన్నాయి. నిజానికి ఇది పెద్ద సమస్య' అని ట్రంప్ విలేకరుల ప్రశ్నలకు బదులిచ్చారు. కాగా సుంకాల విషయంలో రెండు దేశాల మధ్య స్పష్టత రాకపోవడం గమనార్హం. 'అనేక వస్తువులపై భారత్ 30, 40, 60....70 శాతం సుంకం కూడా విధిస్తోందని నేను చెప్పాల్సి ఉంది. కొన్నింటి విషయంలో సుంకాలు అంతకంటే ఎక్కువగా కూడా ఉన్నాయి. ఉదాహరణకు భారత్‌కు వెళుతున్న అమెరికా కార్లపై 70 శాతం సుంకం విధిస్తున్నారు. దీంతో వాటిని అక్కడ విక్రయించడం అసంభవం అవుతోంది.

వాణిజ్య లోటును పూడ్చుకుంటాం

చమురు, గ్యాస్ అమ్మకాలతో వాణిజ్య లోటును సులభంగా పూడ్చుకోగలమని ట్రంప్ అన్నారు. దీనిపై తాను, మోడీ ఓ ముఖ్యమైన ఒప్పందం కుదుర్చుకున్నామని ఆయన చెప్పారు. భారత్‌కు చమురు, గ్యాస్ సరఫరా చేసే ప్రపంచ దేశాల జాబితాలో అమెరికాది ప్రథమ స్థానం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 'భారత్‌తో అమెరికా వాణిజ్య లోటు సుమారు 100 బిలియన్ డాలర్లకు చేరింది. గత నాలుగు సంవత్సరాల కాలంలో చోటుచేసుకున్న అసమానతలపై చర్చించి పరిష్కారాన్ని సాధించాలని నేను, మోడీ అంగీకారానికి వచ్చాం. వీటిపై ఇప్పటికే చర్చించి ఉండాల్సింది. కానీ అలా జరగలేదు' అని ట్రంప్ వివరించారు.

2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు...అంటే 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని మోడీ వివరించారు. పరస్పర ప్రయోజనకర వాణిజ్య ఒప్పందంపై రెండు దేశాల బృందాలు త్వరలోనే అంగీకారానికి వస్తాయని చెప్పారు. ఇంధన భద్రత కోసం చమురు, గ్యాస్ వాణిజ్యంపై దృష్టి సారిస్తామని, ఇంధన మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు అణు ఇంధనాన్ని కూడా పెంచుతాయని అన్నారు. చిన్న మాడ్యులర్ రియాక్టర్లపై సహకారాన్ని పెంచుకునే విషయంపై కూడా ట్రంప్‌తో చర్చించానని తెలిపారు. కాగా అణు సహకారంపై ట్రంప్ కూడా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దీనివల్ల లక్షలాది మంది భారతీయులకు సురక్షితమైన, స్వచ్ఛమైన విద్యుత్ అందుబాటు ధరలో లభిస్తుందని చెప్పారు.



అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమైన ప్రధాని మోడీ

ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు

ఉగ్రవాదంపై పోరు విషయంలో భారత్, అమెరికా దేశాలు కలిసికట్టుగా వ్యవహరిస్తాయని మోడీ చెప్పారు. సీమాంతర ఉగ్రవాదాన్ని అంతం చేయాలంటే పటిష్ట చర్యలు అవసరమని తాము అభిప్రాయపడ్డామని అన్నారు. ముంబయి ఉగ్ర దాడి నిందితుడైన రాణా అప్పగింత అంశాన్ని ఆయన ప్రస్తావించారు. భారత్‌లో మారణకాండ సాగించిన వ్యక్తిని అప్పగిస్తున్నందుకు ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సాంకేతిక సహకారంపై...

వ్యూహాత్మకమైన, విశ్వసనీయ భాగస్వామిగా భారత రక్షణ సన్నద్ధతల్లో అమెరికా ముఖ్య పాత్ర పోషిస్తోందని మోడీ తెలిపారు. రాబోయే కాలంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉమ్మడిగా అభివృద్ధి చేసుకుంటామని, ఉత్పత్తి చేస్తామని, బదిలీ చేస్తామని చెప్పారు. 21వ శతాబ్దం సాంకేతికతతోనే ముడిపడి ఉన్నదని అంటూ ఈ రంగంలో రెండు దేశాల మధ్య సన్నిహిత సహకారం ప్రజాస్వామిక విలువలపై విశ్వాసంతో, నూతన దిశగా ముందుకు సాగుతోందని అన్నారు. ఖనిజాలు, ఔషధాల విషయంలో బలమైన సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేసుకునే విషయంపై రెండు దేశాలు దృష్టి సారిస్తాయని మోడీ చెప్పారు. అంతరిక్ష సహకారం విషయంలో కూడా తమ మధ్య సన్నిహిత సహకారం నెలకొని ఉన్నదని అంటూ ఇస్రో, నాసా మధ్య పరస్పరం మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. భారతీయ ఉపగ్రహంపై రెండు దేశాలు త్వరలోనే అంతరిక్షంలోకి వెళతాయని చెప్పారు.

అంతర్జాతీయ అంశాలపై...

ఇండో-పసిఫిక్‌లో శాంతి, సుస్థిరత, సౌభాగ్యాన్ని పెంచేందుకు భారత్, అమెరికా కలసికట్టుగా కృషి చేస్తాయని మోడీ తెలిపారు. ఈ విషయంలో క్వాడ్ ప్రత్యేక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. భారత్-మధ్య ప్రాచ్య యూరప్ ఆర్థిక కారిడార్‌ను కూడా ఆయన ప్రస్తావిస్తూ ఈ ప్రాంతంలో ఆర్థిక కారిడార్ల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. చరిత్రలోనే అతి పెద్ద వాణిజ్య రహదారిని నిర్మించేందుకు సహకరిస్తామని తెలిపారు. ఈ రహదారి భారత్ నుండి ఇజ్రాయిల్, ఇటలీ, అమెరికా వరకూ ఉంటుందని చెబుతూ ఓడరేవులు, రైల్వేలు, సముద్ర గర్భంలోని కేబుల్స్ ద్వారా భాగస్వాములను కలుపుతామని వివరించారు. దీనిపై పెద్ద ఎత్తున డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుందని అన్నారు.

చైనాతో సంబంధాలపై...

భారత్-చైనా సరిహద్దులో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయని, అవి ఆగిపోవాల్సిన అవసరం ఉన్నదని మోడీ చెప్పారు. ఈ విషయంలో తన సాయం అవసరమైతే చేస్తానని అన్నారు. 'మాకు చైనాతో మంచి సంబంధాలు ఉంటాయని అనుకుంటున్నాను. కోవిడ్ వచ్చే వరకూ దేశాధ్యక్షుడు క్సితో బాగానే సంబంధాలు నెరిపాను. అప్పటి వరకూ మేము బాగా సన్నిహితంగా గడిపాం. ప్రపంచంలో చైనా ఓ ముఖ్య పాత్ర పోషిస్తోందని నేను విశ్వసిస్తున్నాను. ఉక్రెయిన్, రష్యా యుద్ధ నివారణకు వారు కృషి చేసి ఉండవచ్చు. భారత్-చైనా సరిహద్దులో ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. అవి కొనసాగుతూనే ఉన్నాయని అనుకుంటున్నా. ఈ విషయంలో నేనేమైనా చేయగలిగేది ఉంటే చేస్తా. ఎందుకంటే ఘర్షణలు ఆగిపోవాలి. అవి చాలా కాలం నుండి కొనసాగుతున్నాయి. హింస జరుగుతోంది. చైనా, రష్యా, భారత్...మేమందరం కలిసి ముందుకు సాగగలం. అది చాలా ముఖ్యం' అని మోడీ వివరించారు. అంతకుముందు ట్రంప్ ఓవల్ కార్యాలయంలో మోడీని కలిశారు. ఆయనతో కరచాలనం చేసి హత్తుకున్నారు. ప్రధాని మోడీని 'దీర్ఘకాల స్నేహితుడి'గా అభివర్ణించారు.




మీ కోసం

వెల్లుల్లితో కలిపి బంగాళాదుంపలు ఉంచితే చాలా రోజుల వరకు తాజాగా ఉంటాయి.

జీవన సౌరభం

మన లోపాలను మనం గ్రహించడం అన్నింటికన్నా గొప్ప చదువు.

సంకల్పం



రామాపురంలో దేవయ్య శాంతమ్మ అనే దంపతులు కూరగాయలు వ్యాపారం చేస్తూ జీవిస్తున్నారు. వాళ్ల అమ్మాయి గౌతమి బాగా చదువుతుంది. తల్లిదండ్రులు కూడా కూతుర్ని పెద్ద చదువులు చదవించాలని అనుకున్నారు. గౌతమి 10వ తరగతి చక్కని మార్కులతో పాస్ అయింది. గౌతమిని పెళ్లి చేసుకుంటామని చుట్టుపక్కల చాలా సంబంధాలు వచ్చాయి. కానీ దేవయ్య శాంతమ్మలు కుమార్తె చదువుకుంటుందని, ఇప్పుడు వివాహ వయస్సు కాదని చెప్పి గౌతమిని పై చదువులు చదివించారు. గౌతమి కూడా తల్లిదండ్రుల ఆశ మేరకు చక్కగా చదువుకుంది. ఇంటర్మీడియట్ పూర్తి అయిన తర్వాత చుట్టుపక్కల వారు ఇక పై చదువులు చదివించడం కష్టం. గౌతమికి పెళ్లి చేసేయండి అని దేవయ్య శాంతమ్మలకు చెప్పేవారు. కానీ గౌతమి, తల్లిదండ్రులతో 'నేను వైద్యవృత్తిలో స్థిరపడతాను. వైద్యవిద్య అభ్యసిస్తాను. నన్ను చదివించండి' అని కోరింది.

తాహతుకు మించిన చదువైనా బిడ్డ కోరిక తీర్చాలనే సదుద్దేశంతో దేవయ్య శాంతమ్మ తాము నివసిస్తున్న ఇంటిని తనఖా పెట్టి మరీ గౌతమిని వైద్య విద్యలో జాయిన్ చేశారు. రాను రాను ఫీజు భారం దేవయ్య దంపతులకు భారంగా మారింది. అందిన చోటల్లా అప్పులు చేశారు. కొంతమంది దేవయ్య శాంతమ్మ దంపతులకు 'తలకు తగ్గ తలపాగా చుట్టాలి. అప్పులు చేసి కూతుర్ని చదివించడం అవసరమా? ఈపాటికి పెళ్లి చేసి ఉంటే హాయిగా ఉండేది కదా!' అంటూ సూటి పోటి మాటలు ఆడేవారు. సాయం మాత్రం చేసేవారు కాదు. అవన్నీ భరిస్తూనే దేవయ్య శాంతమ్మలు గౌతమిని చదివించారు.



గౌతమి వైద్య విద్య పూర్తి చేసింది. వైద్యురాలిగా అదే ఊరిలో ఉద్యోగం పొందింది. అప్పుడు సూటిపోటి మాటలతో వేధించిన వారే గౌతమికి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అది చూసిన గౌతమి తల్లిదండ్రులు ఎంతో సంతోషించారు.

ఎండుపిల్లి. గౌరీ,
9వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముత్యాల పేట,
కవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా.

పదాలు గుర్తించండి

sun	l	c	b	s	u	n
boat	h	a	o	m	l	y
heart	e	r	a	u	i	p
snail	a	r	t	i	a	p
puppy	r	o	l	j	n	u
carrot	t	t	i	t	s	p

పిల్లలూ, ఇక్కడ బాక్సులో ఉన్న అక్షరాల్లో పక్కనే ఉన్న పదాలు ఉన్నాయి. ఎక్కడున్నాయో సరిగ్గా గుర్తించండి చూద్దాం. అడ్డం, నిలువు, ఐమూలలగా ట్రై చేయండి.

నేను గీసిన బొమ్మ



బి.ఆద్య,
1వ తరగతి,
గ్లేబ్ స్కూల్,
అర్లింగ్టన్, వర్జినియా,
అమెరికా.



బుల్లెట్ బండి తోలాడని చేతులు నరికేశారు..

వాళ్లు అందరిలాంటివాళ్లేనని ఈ సమాజం ఎప్పుడు గుర్తిస్తుంది! కులం పేరుతో ధూషించడం, దాడి చేయడం, ప్రాణాలు తీయడం ఎప్పుడు ఆపుతుంది! ఎప్పటినుండో ఇల్లు, స్కూలు, కాలేజీ, యూనివర్శిటీ ఎక్కడ చూసినా కులం పేరుతో వాళ్లు వివక్షకు గురవుతూనే ఉన్నారు. ప్రేమ, పెళ్లి, చదువు.. ఉద్యోగం, హోదా.. ఎక్కడైనా వాళ్లని చిన్నచూపే చూస్తున్నారు. తాజాగా తమిళనాడులో వెలుగుచూసిన ఉదంతం మరో ఉదాహరణ.

ఫిబ్రవరి 12న 19 ఏళ్ల అయ్యసామిపై ఓ ముగ్గురు యువకులు దాడికి తెగబడ్డారు. ఆ దాడిలో విచక్షణ కోల్పోయిన అగ్రకుల యువకులు అయ్యసామి చేతులు నరికివేశారు. ఇంత అమానుషం చేయడానికి కారణం.. తమ కంటే తక్కువ కులంలో పుట్టిన అయ్యసామి తమ ఎదుట రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ నడుపుకుంటూ వెళ్లడం.

శివగంగై జిల్లాలో జరిగిన ఈ ఘటనతో అయ్యసామి కుటుంబమే కాదు, ఆ ప్రాంతమంతా భీతిల్లిపోయింది. దాడులు కంటే ముందు నుండే ఆ ప్రాంతంలో కులం పేరుతో జరిగిన ఘర్షణలు ఎన్నో ఉన్నాయి. దీనిపై అయ్యసామి సోదరుడు ఇలా చెప్పాడు. 'మేము అందరం ఉపయోగించే రోడ్డుపై నడవకూడదని అగ్రకులం వాళ్లు హుకుం జారీచేశారు. సౌకర్యవంతమైన ఇల్లు కట్టుకున్నా, వాహనాలు కొనుక్కున్నా ఇంటికి వచ్చి మరీ కులం పేరుతో తిడుతూ కొట్టేవారు. మొన్నీమధ్య మేము డాబా ఇల్లు కట్టుకునేటప్పుడు కూడా ఇలాగే చేశారు. ఇప్పుడు మా అన్నయ్య, వాళ్ల ముందు బుల్లెట్ బండిపై వెళ్లడం తట్టుకోలేకపోయారు. అందుకే గొడవకి దిగి రెండు చేతులూ నరికేశారు' అని విలపిస్తూ చెప్పాడు.



దాడి చేసిన యువకులు, దాడికి గురైన యువకుడు అందరూ ఒక వయసువారే. కానీ కులం వారిని వేరు చేసింది. వారు ఒకే కళాశాలలో చదువుతున్నా, ఒకే విద్యాభ్యాసం చేస్తున్నా కులం వారి మధ్య అంతరాలను మాత్రం చెరపడం లేదు.

వరుస దాడులు..

చదువుతున్న పిల్లల్లో ఈరకమైన ధోరణులు పెరగడం సమాజానికి అంత మంచిది కాదు. మొన్న నవంబరులో తిరునల్వేలి జిల్లాలో 17 ఏళ్ల పాలిటెక్నిక్ విద్యార్థి మనోజ్‌కుమార్‌పై అదే వయసున్న విద్యార్థులు దాడి చేశారు. అప్పుడు ఏం జరిగిందంటే.. వేగంగా కారు నడపుతున్న విద్యార్థులు అమాంతం మనోజ్ వైపుకి దూసుకొచ్చారు. దాంతో అతడు వారిని వారిస్తూ గట్టిగా మాట్లాడాడు. స్థానికులు కూడా విద్యార్థుల బృందం చేసిన తప్పుని ఎత్తిచూపారు. అప్పుడు అక్కడి నుండి విద్యార్థులు వెళ్లిపోయారు. మనోజ్ కూడా ఇంటికి వెళ్లాడు.



అయితే కొన్ని గంటల తరువాత, వారందరూ మనోజ్ ఇంటికి వెళ్లి, కర్రలతో, సీసాలతో అతని తలపై బలంగా కొట్టారు. రక్తం కారుతున్న మనోజ్‌ని అక్కడే వదిలేసి వెనుదిరిగారు. ఇంత కర్కశత్వం చేయడానికి కారణం మనోజ్ వాళ్ల కంటే తక్కువ కులంలో పుట్టడమే..

ఆ తరువాత డిసెంబరులో ఆగ్రాలోని ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కూడా ఇలాంటి ధోరణే కనబర్చాడు. 40 ఏళ్ల ఆ మాస్టారు, తక్కువ కులానికి చెందిన విద్యార్థులను లక్ష్యం చేసుకుని ధూషిస్తున్న వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. 'మాస్టారు మమ్మల్ని చూస్తేనే చాలా చిరగ్గా ముఖం పెడతారు. మమ్మల్ని అంటరానివారిగా చూస్తారు. ఒక్కోసారి ఏకారణం లేకుండానే మమ్మల్ని కొట్టేవారు' అని ఆ విద్యార్థులు అమాయకంగా మాట్లాడిన వీడియో కూడా సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది.

నేరాలు ఆగడం లేదు..

మన రాష్ట్రంలో హత్యానేరాలపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి పిలుపునిచ్చిన గంటల వ్యవధిలోనే ఓ లైంగిక వేధింపుల ఘటన గతేడాది నవంబరులో జరిగింది. దళితురాలైన బాధితురాలు 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని. పాఠశాల నుండి ఇంటికి తిరిగి వెళ్తుండగా ఆమెపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. దారుణంగా అత్యాచారానికి తెగబడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న బాలికను స్థానికులు ఆస్పత్రిలో చేర్చడం అప్పట్లో వార్తల్లో నిలిచింది.

రోజుకు ఇలాంటి దాడులు ఎన్నో జరుగుతున్నాయి. పోలీసు స్టేషను వరకు వెళ్లేవి కొన్నే.. వెలుగుచూసేవీ కొన్నే.. ఈ దాడులకు చరమగీతం పాడాలంటే.. ముందు ఈ ధోరణులను మన మెదళ్ల నుండి తరిమికొట్టాలి. యువత శాస్త్ర, సాంకేతికతను అందిపుచ్చుకుని అభివృద్ధి పథంలో నడిచినప్పుడే సమాజం వేగంగా వృద్ధి చెందుతుంది. కులం, మతం అంటూ ద్వేషం పెంచుకుని, దాడులు చేస్తూ ఉంటే.. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా కూపస్థ మండూకంలా కుంచించుకుపోతుంది.



నువ్వుల్లో పోషకాలు

నువ్వుల్లో ఒమెగా ఫ్యాటీ యాసిడ్స్, ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన పిండిపదార్థాలు, యాంటీ ఆక్సిడెంట్లు, కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్స్, ఫ్యాట్స్, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్, యాంటీహిస్టమెన్స్ ఎక్కువగా ఉంటాయి. అందుకే రోజూవారి ఆహారంలో నువ్వులు భాగంగా చేర్చుకుంటే వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది.

- వీటిలో ఉన్న ఐరన్ జింక్, కాల్షియం వల్ల విటమిన్ 'ఇ' సమృద్ధిగా లభిస్తుంది. రక్తహీనతతో బాధపడే మహిళలు వీటిని తింటే నీరసం తగ్గుతుంది.
- మోకాళ్లు, శరీర నొప్పులతో నిత్యం బాధపడే వారు నువ్వులు, బెల్లం కలిపి ఉండలు చేసుకుని తింటే ఆరోగ్యం మెరుగుపడుతుంది.
- వీటిలో పీచు పదార్థం అధికంగా ఉండడం వల్ల జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. అలాగే ఫైటో స్టెరాల్స్ వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ ఉత్పత్తి తగ్గుతుంది. దాంతో గుండె సంబంధిత వ్యాధులు రాకుండా వుంటాయి.
- నల్ల నువ్వుల్లో క్యాన్సర్ నివారించే గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి బ్రెయిన్‌లో ట్యూమర్ గ్రోత్‌ను నివారిస్తాయి.
- వీటిల్లో 20 శాతం ప్రొటీన్లు, కాల్షియం ఉంటాయి. దెబ్బలు తగిలినప్పుడు త్వరగా మానటానికి సహకరిస్తాయి.
- నువ్వుల నూనెలో ఉండే ప్రోటీన్లు శరీరంలో అధిక రక్తపీడనాన్ని అదుపు చేస్తాయి.
- వీటిలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో ప్లాస్మాలోని గ్లూకోజ్ స్థాయిలను పెంచుతుంది.
- ఇన్ని ప్రయోజనాలు ఉన్న నువ్వుల నూనెను అప్పుడప్పుడు జుట్టుకి పట్టించి, శుభ్రం చేసుకుంటూ ఉంటే వెంట్రుకలు నల్లగా మారి ఆరోగ్యంగా పెరుగుతాయి.

చాంపియన్స్ ట్రోఫీ విజేతకు రూ.19కోట్లు

ప్రైజ్‌మనీ వివరాలను వెల్లడించిన ఐసిసి

దుబాయ్: పాకిస్థాన్ వేదికగా జరిగే చాంపియన్స్ ట్రోఫీ ప్రైజ్‌మనీ వివరాలను అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) శుక్రవారం వెల్లడించింది. టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ 6.9 (రూ.60 కోట్లు)మిలియన్ డాలర్లు 8జట్లకు అందజేయనున్నట్లు తెలిపింది. విజేతకు 2.24 డాలర్ల(రూ.19.45కోట్లు), రన్నరప్ జట్టుకు 1.12 మిలియన్ డాలర్లు(రూ.9.72కోట్లు), సెమీస్‌లో ఓడిన ఒక్కో జట్టుకు రూ.4.86కోట్లు చొప్పున అందజేయనున్నట్లు పేర్కొంది. గ్రూప్ దశలో ఒక్కో మ్యాచ్ గెలిచిన జట్టు రూ.29లక్షలు చొప్పున అందుకోనుండగా.. 5, 6 స్థానాల్లో ఉన్న జట్లు రూ.3.04కోట్లు చొప్పున, 7, 8 స్థానాల్లో నిలిచిన జట్లు రూ.1.21కోట్లు చొప్పున అందుకోనున్నాయి.



ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడే ప్రతి జట్టు కనీసం రూ.1.08కోట్లు చొప్పున అందుకోనున్నట్లు ఐసిసి వెల్లడించింది. ఇది 2017లో జరిగిన చాంపియన్స్ ట్రోఫీతో పోల్చిచూస్తే సుమారు 53శాతం అధికంగా ఉన్నట్లు ఐసిసి పేర్కొంది.

పాకిస్తాన్ వేదికగా ఫిబ్రవరి 19నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ జరగనుంది. ఐసిసి టాప్-8 ర్యాంక్‌లు ఉన్న 8 జట్లు.. రెండు గ్రూపులుగా తలపడనున్నాయి. ప్రతి గ్రూపు నుంచి టాప్ రెండు జట్లు సెమీస్‌కు ప్రవేశిస్తాయి. ఐసిసి చాంపియన్స్ ట్రోఫీ ప్రతి నాలుగేళ్లకు ఒకసారి జరగనున్న విషయం తెలిసిందే.

ప్రభుత్వమే స్టూడియోలను నిర్మించాలి : మహేశ్వర కె.



'ఆంధ్రప్రదేశ్‌లో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఎన్నో అవకాశాలున్నాయి. విశాలమైన సముద్ర తీరం, కనువిందు చేసే నదీ ప్రవాహాలు, విదేశీ పర్యాటకులను సైతం ఆకర్షించేలా అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. అరకు, విశాఖపట్టణం, విజయవాడతోపాటుగా హోప్‌ఐలాండ్, భవానీఐలాండ్, హార్సిలీహిల్స్, భవానీద్వీపం, తలకోన, భైరవ కోన వంటి ప్రాంతాలు షూటింగ్‌లకు మంచి అనుకూలమైన ప్రదేశాలు. కర్నాటక, కేరళ రాష్ట్రాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే సినిమాల నిర్మాణాలకు అవసరమైన మౌళిక సదుపాయాలు, స్టూడియోలు వంటివి ఏర్పాటుచేస్తున్నాయి. ఆంధ్రాలో సినీ పరిశ్రమ అభివృద్ధికి ఉన్న అవకాశాలు గురించి తెలియజేస్తాం. రాష్ట్రప్రభుత్వం ద్వారా ప్రోత్సాహకాలు, రాయితీలు, వసతులు కల్పించాల్సిన ఆవశ్యకతను గుర్తుచేస్తాం' అని సినీ నిర్మాత మహేశ్వర కె.అన్నారు.

జాతీయ క్రీడల్లో సర్వీసెస్‌కు అత్యధిక పతకాలు

- ఆంధ్రప్రదేశ్‌కు 18వ, తెలంగాణకు 26వ స్థానం
- ముఖ్య అతిథులుగా అమిత్ షా, మాండవీయ
- ముగిసిన 38వ జాతీయ క్రీడలు






జాతీయ క్రీడలను దిగ్విజయంగా పూర్తిచేసిన ఉత్తరాఖండ్ ప్రభుత్వానికి ట్రోఫీని అందజేస్తున్న అమిత్ షా

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ వేదికగా ముగిసిన 38వ జాతీయ క్రీడల్లో సర్వీసెస్ జట్టు 68 స్వర్ణాలతో సహా మొత్తం 121 పతకాలతో అగ్రస్థానంలో నిలిచింది. శుక్రవారం జరిగిన ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, క్రీడల మంత్రి మన్సుక్ మాండవీయ హాజరయ్యారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధమి వీరిని సాదరంగా ఆహ్వానించారు. మాండవీయ మాట్లాడుతూ.. ఉత్తరాఖండ్ ప్రభుత్వం జాతీయ క్రీడలను దిగ్విజయంగా పూర్తిచేసిందని, అథ్లెట్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించడం హర్షణీయమన్నారు. ఇక అమిత్ షా మాట్లాడతూ.. రాబోయే రోజుల్లో ఉత్తరాఖండ్ స్పోర్ట్స్ హబ్‌గా నిలుస్తుందని కొనియాడారు. 2036 ఒలింపిక్స్‌కు భారత్ ఆతిథ్యమే లక్ష్యంగా క్రీడలు దిగ్విజయంగా ముగిసాయమని పేర్కొన్నారు. 39వ జాతీయ క్రీడలు మేఘాలయాలో జరగనున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కొంగల్ సంగ్మా ఉత్తరాఖండ్ క్రీడల మంత్రి రేఖా ఆర్యా క్రీడల బారెన్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో భారత ఒలింపిక్ అసోసియేషన్(ఐఓఎ) అధ్యక్షురాలు పిటి ఉష, మహిళల బాక్సింగ్ లెజెండ్ మేరీ కోమ్, ఒలింపిక్ పతక విజేతలు గగన్ నారంగ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ముగింపు వేడుకలకు దాదాపు 25వేల మంది ప్రేక్షకులు హాజరయ్యారు. ఈ క్రీడల్లో అత్యధిక స్వర్ణ పతకాలను సర్వీసెస్ జట్టు సాధించి టాప్‌లో నిలువగా.. రెండో స్థానంలో ఉన్న మహారాష్ట్ర 198పతకాలతో నిలిచింది. ఇందులో 54స్వర్ణ, 71రజత, 73కాంస్యాలుండగా.. మూడో స్థానంలో హర్యానా ఉంది. హర్యానా సాధించిన 153పతకాల్లో 48స్వర్ణ, 47రజత, 58కాంస్య పతకాలుండగా.. కర్ణాటక, మధ్యప్రదేశ్ టాప్-5తో ముగించాయి. ఇక ఆంధ్రప్రదేశ్ జట్టు 7స్వర్ణ, రజత, 6కాంస్యాలతో సహా 14పతకాలతో 18వ స్థానంలో నిలువగా.. తెలంగాణ 3స్వర్ణ, మరో 3రజత, 12కాంస్య పతకాలతో 18పతకాలతు సాధించి 26వ స్థానంలో నిలిచింది. ఆతిథ్య ఉత్తరాఖండ్ జట్టు 24స్వర్ణ, 35రజత, 44 కాంస్యాలతోపాటు మొత్తం 103 పతకాలతో 7వ స్థానంలో నిలిచింది.

పతకాల పట్టిక

రాష్ట్రం	స్వ	ర	కా	మొ
1. సర్వీసెస్	68	26	27	121
2. మహారాష్ట్ర	54	71	76	201
3. హర్యానా	48	47	58	153
4. మధ్యప్రదేశ్	34	26	22	82
5. కర్ణాటక	34	18	28	80
6. తమిళనాడు	27	30	35	92
7. ఉత్తరాఖండ్	24	35	44	103
8. పశ్చిమ బెంగాల్	16	13	18	47
9. పంజాబ్	15	20	31	66
10. ఢిల్లీ	15	18	29	62
11. మణిపూర్	14	16	25	55
12. ఒడిషా	14	15	17	46
13. ఉత్తరప్రదేశ్	13	20	23	56
14. కేరళ	13	17	24	54
15. రాజస్థాన్	9	11	23	43
16. గుజరాత్	8	10	20	38
17. జార్ఖండ్	7	6	12	25
18. ఆంధ్రప్రదేశ్	**7**	**1**	**6**	**14**
19. జమ్ము-కాశ్మీర్	5	6	13	24
20. అండమాన్ నికోబార్ ఐస్‌లాండ్	5	3	2	10
21. ఛండీగడ్	4	6	9	19
22. హిమాచల్‌ప్రదేశ్	4	3	8	15
23. అరుణాచల్‌ప్రదేశ్	4	3	6	13
24. అస్సాం	3	15	16	34
25. ఛత్తీస్‌గడ్	3	4	9	16
26. తెలంగాణ	**3**	**3**	**12**	**18**
27. గోవా	2	4	4	10
28. మిజోరాం	2	0	1	3
29. బీహార్	1	6	5	12
30. మేఘాలయ	1	2	2	5
31. పాండిచ్చేరి	0	1	1	2
32. నాగాలాండ్	0	0	2	2
33. సిక్కిం	0	0	2	2



21న 'శివంగి' విడుదల

శ్రీ స్వర్ణ వరల్డ్ మూవీస్ బ్యానర్‌పై బి.నాగవర్థిని సమర్పణలో మూర్తి నం.1 కథానాయకుడుగా ద్విపాత్రాభినయంతో తెరకెక్కిన సినిమా 'శివంగి'. ఇందులో ఆయన తండ్రీ కొడుకులుగా నటించారు. వెంకీ, దివ్యశ్రీ, రాజశ్రీ ప్రధాన పాత్రల్లో నటించారు. క్యారెక్టర్ ఆర్టిస్టులుగా లక్ష్మణ్‌చౌదరి, బొబ్బిలి విజయ్, పందిరికృష్ణ, తిలక్, దివ్యశ్రీ, కుంచనపల్లి మౌనిక,పొట్టి చిట్టిబాబు, పలాసా శ్రీను, తోపాటు గా కోట శంకరరావు, చిత్రం శ్రీను, సురేష్ బాందేపురపు, కనకదుర్గ, డబుల్ ఎక్స్ శివ, గడ్డం శివ, వై.పవన్‌కుమార్, రెహ్మాన్ (పొన్నూరు), వడ్డీశ్వరం కుమార్, విఆర్ఒ రామారావు, రాణి, నాగేశ్వరరావు, రామతీర్థ, జెన్నీ నటించారు. కెమెరామెన్ పిఎస్ రమేష్, కొరియోగ్రఫీ ఎస్‌కె ఖాదర్-ఫణీంద్ర కుమార్, సంగీతం చురు వేళ్ల రవికుమార్, కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్, నిర్మాత, దర్శకత్వం మూర్తి బాందేపురపు. ఈనెల 21న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. యాక్షన్, కామెడీ, హర్రర్ నేపథ్యంలో కథ ఆద్యంతం సస్పెన్స్ థ్రిల్లర్‌గా సాగుతుందని నిర్మాత మూర్తి నం.1 తెలిపారు. తమ సినిమాను ఆదరించి బ్లాక్‌బస్టర్‌గా నిలపాలని కోరారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68